

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 25 | హైదరాబాద్ | ఆదివారం | 12-07-2026 | పేజీలు: 08


## మూగబోయిన మధురగానం..

**ఎస్. జానకి కన్నుమూత**

- వయోభారంతో వచ్చిన అనారోగ్య సమస్యలతో మైసూరులో తుదిశ్వాస
- ఆరు దశాబ్దాలకు పైగా భారతీయ సినీ సంగీతాన్ని మంత్రముగ్ధులను చేసిన గానగంధర్వి
- తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం సహా 18కు పైగా భాషల్లో వేలాది పాటలు
- 1957లో తొలి సినీ గీతంతో ప్రారంభమైన అపూర్వ సంగీత ప్రయాణం
- 40 వేలకుపైగా పాటలు ఆలపించి అరుదైన రికార్డు సృష్టించిన జానకి
- 'వెన్నెల్లో గోదారి అందం' పాటకు జాతీయ ఉత్తమ గాయనిగా గుర్తింపు
- నాలుగు జాతీయ పురస్కారాలు, 30కుపైగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డులతో ఘన గౌరవం
- దక్షిణాది సినీ సంగీతానికి ఓ స్వర్ణయుగాన్ని అందించిన అపూర్వ గాయని
- భావవ్యక్తీకరణకు ప్రతిరూపంగా నిలిచిన జానకి గానం
- భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

భారతీయ సినీ సంగీత ప్రపంచం ఓ మహోన్నత గాయనిని కోల్పోయింది. దక్షిణాది సంగీత అభిమానులు ప్రేమగా నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా మిగతా 2లో..



## వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు

- తీరిన జిల్లా రైతాంగ దశాబ్దాల సాగునీటి కల
- కృష్ణమ్మ ఒడికి చేరిన గోదావరి నదీ జలాలు
- సాకారమైన రైతాంగ దశాబ్దాల స్వప్నం
- వైరా రిజర్వాయర్‌ను ముద్దాడిన గోదావరి నదీ జలాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పం
- పట్టుబట్టి ప్రతిష్టాత్మక లింక్ కెనాల్ పూర్తి చేయించిన వైనం
- రూ.100 కోట్ల వ్యయంతో రాజీవ్ లింక్ కెనాల్
- రికార్డు సమయంలో పనులు పూర్తి చేసిన యంత్రాంగం
- రెండు జిల్లాల పరిధిలో లక్షలాది ఎకరాలకు భరోసా
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రైతులకు శాశ్వత పరిష్కారం



02

## 117 సీట్లు కాదు.. కాంగ్రెస్‌కు 7 సీట్లు కూడా రావు..!

- రాజకీయాలు కాదు, రైతుల కోసమే మాట్లాడుతున్నా: కేటీఆర్
- రిజర్వాయర్లలో కేవలం 23% మాత్రమే నీటి నిల్వలు
- కన్నెపల్లి నుంచి నీటి ఎత్తిపోతలపై రిటైర్డ్ ఇంజినీర్ల సూచనలు
- 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయొచ్చని ప్రతిపాదన
- గోదావరి బేసిన్‌ను సస్యశ్యామలం చేయవచ్చన్న కేటీఆర్
- ఇంజినీర్ల సూచనలను అమలు చేయడం లేదని సీఎం పై విమర్శలు
- కాళేశ్వరం అంశంపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించిన బీఆర్ఎస్
- రైతుల ప్రయోజనాలే తమ ప్రధాన లక్ష్యమని కేటీఆర్ స్పష్టం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలో నీటి నిర్వహణ, రైతుల పరిస్థితి, కాళేశ్వరం ప్రాజెక్టు, రాజకీయ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మాట్లాడేది రాజకీయ అంశాలపై కాదని, పూర్తిగా రైతుల ప్రయోజనాల కోసమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో ప్రస్తుతం కేవలం 23% మాత్రమే నీరు ఉందని, మిగిలిన 77% సామర్థ్యం ఖాళీగా ఉందని పేర్కొన్నారు. రిటైర్డ్ ఇంజినీర్లు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసి కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి మేడిగడ్డతో సంబంధం లేకుండా నీటిని ఎత్తిపోయవచ్చని సూచించారని కేటీఆర్ తెలిపారు. రోజుకు 2 టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు నీటిని లిఫ్ట్ చేస్తే సుమారు 200 టీఎంసీల నీటితో గోదావరి బేసిన్‌ను సస్యశ్యామలం చేయవచ్చని వారు సూచించారని చెప్పారు. అయితే ఈ సూచనలను అమలు చేయకుండా సీఎం భేషజాలకు పోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి ప్రకృతి వల్ల వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా 2లో..

# ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే కుట్ర

- కాళేశ్వరంపై బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం
- వాస్తవాలు ప్రజలకు చెబుతున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల వ్యాఖ్యలు
- కాళేశ్వరంపై ఈటల అవాస్తవాలు చెప్పారని..
- ఆ వ్యాఖ్యలతో తన గౌరవం కోల్పోయారని విమర్శ
- మేడిగడ్డ లోపాలు కేసీఆర్ హయాంలోనే బయటపడ్డాయని స్పష్టీకరణ
- 2020లోనే ఇంజినీర్లు హెచ్చరించినా బీఆర్ఎస్ పట్టించుకోలేదన్న ఆరోపణ
- నిర్లక్ష్యంతోనే లోపాలు పెరిగి మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని వ్యాఖ్య
- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం ఎన్డీఎస్ఏ నివేదిక
- ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని విమర్శ
- కేసీఆర్, హరీశ్‌రావు అబద్ధపు ప్రచారం మానుకోవాలని సీఎం సూచన

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈటల చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, ఆయనపై తమకు వ్యక్తిగతంగా గౌరవం ఉన్నప్పటికీ ఆ వ్యాఖ్యలతో తన గౌరవాన్ని తానే తగ్గించుకున్నారని అన్నారు.

శనివారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. 2019 జూన్ 21న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించారని గుర్తుచేశారు.

ప్రాజెక్టు ప్రారంభమైన కొద్ది నెలల్లోనే మేడిగడ్డ



బ్యారేజ్‌లో నిర్మాణ లోపాలు బయటపడ్డాయని సీఎం తెలిపారు. 2020 మే 18న అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి ప్రభుత్వానికి లేఖ రాసి బ్యారేజ్‌లో ఉన్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారని వెల్లడించారు. అప్పటికే ఇంజినీర్లు పలు సాంకేతిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా బీఆర్ఎస్ ప్రభుత్వం మిగతా 2లో..

## షాబాద్ ఆరుగురి హత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

- ప్రభుత్వ వైఫల్యమే కారణం: హరీష్
- సీఎం రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్
- సబితా ఇంద్రారెడ్డిని అడ్డుకోవడంపై ఆగ్రహం
- బాధితురాలికి రూ. కోటి డిపాజిట్ చేయాలన్న డిమాండ్




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో జరిగిన ఆరుగురి హత్యోదంతంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘోర సామూహిక హత్య హృదయవిదారకమైనదని, ఈ ఘటనతో రాష్ట్రంలోని ఆడపిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వ పూర్తి వైఫల్యం వల్లే ఈ దారుణం జరిగిందని దుయ్యబట్టారు. న్యాయం కోసం బాధితులు నెలల తరబడి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి మిగతా 2లో..

## హైదరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్..

- తెలంగాణకు రూ.5 వేల కోట్ల రైల్వే బడ్జెట్
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి
- హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరుతో అనుసంధానిస్తాం
- తెలంగాణకు రూ.5 వేల కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించాం
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటన
- రాష్ట్రంలోని 40 రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణకు కేంద్రం నిధుల మంజూరు
- దేశవ్యాప్తంగా 1,300 స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరణ
- ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణ పూర్తయిందన్న రైల్వే శాఖ

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**


తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన *'వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర'* సదస్సులో కేంద్ర బొగ్గు, మిగతా 2లో..



## గుండెలు పగిలే శోకం.. దైవాలగూడలో రాక్షసక్రీడ!

- ఏ పాపమూ ఎరుగని పసి ప్రాణాలు
- లోకం తెలియని అమాయకులు..
- ఒకే రాత్రి ఉన్మాది ప్రతీకారానికి బలైన ఆరు నిండు జీవాలు!
- కన్నీటి మడుగులో గ్రామం..
- పగతో రగిలిన కిరాతకుడి కత్తి వేటు!
- ఆ అర్ధరాత్రి వేళ ముంచుకొచ్చిన మరణం
- రెండు కుటుంబాల్లో మిగిలిన అనంత విషాదం..
- పసిమొగ్గలను సైతం వదల్లేని రాక్షసత్వం!





**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఆరుగురి హత్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. ఒకే రాత్రిలో ఇద్దరు చిన్నారులు, తన భార్య, పోక్సో కేసు నమోదు చేయించిన మైనర్ బాలిక, ఆమె తల్లి, నాయనమ్మలను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. పోక్సో కేసు పెట్టారనే మిగతా 2లో..

# మూగబోయిన మధురగానం..

**మొదటిపేజీ తరువాయి**

అని పిలుచుకునే ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి కన్నుమూశారు. వయోభారంతో వచ్చిన ఆరోగ్య సమస్యల కారణంగా మైసూరులోని అపోలో ఆస్పత్రిలో కార్డియెక్ అరెస్ట్‌తో ఆమె మృతి చెందారు. ఆమె మరణవార్త తెలిసిన వెంటనే సినీ, సంగీత, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అభిమానులు, సంగీతప్రియులు సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులర్పిస్తున్నారు.

1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించిన జానకి చిన్నప్పటి నుంచే సంగీతంపై అపారమైన ఆసక్తి కనబరిచారు. చిన్న వయసులోనే ఆకాశవాణి నిర్వహించిన జాతీయ స్థాయి గాన పోటీల్లో ప్రతిభ చాటుకుని తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. అదే ఆమె సంగీత జీవితానికి బలమైన పునాది అయింది. జానకి సినీ గాన ప్రయాణం 1957లో ప్రారంభమైంది. తమిళ చిత్రం విధియిన్ విలయట్టు కోసం ఆమె తొలి సినీ పాటను రికార్డు చేశారు. అదే ఏడాది తెలుగు చిత్రం *'ఎంఎల్ఏ'* కోసం కూడా పాటలు పాడి తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టారు. అలా మొదలైన ఆమె ప్రయాణం ఆరు దశాబ్దాలకుపైగా నిరాటంకంగా కొనసాగింది.

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు 18కు పైగా భారతీయ, విదేశీ భాషల్లో ఆమె పాటలు ఆలపించారు. వివిధ అంచనాల ప్రకారం ఆమె *40 వేలకు పైగా పాటలు* పాడి భారతీయ సినీ సంగీత చరిత్రలో అత్యధిక గీతాలు ఆలపించిన గాయనుల్లో ఒకరిగా నిలిచారు. భావాలను స్వరంలో ఒలికించడంలో జానకి ప్రత్యేకత అసాధారణం. విషాదం, ప్రేమ, భక్తి, జానపదం, శృంగారం, హాస్యం, చిన్నపిల్లల గొంతు, వృద్ధురాలి స్వరం.. ఇలా ఏ భావాన్నైనా తన గాత్రంతో సజీవంగా వినిపించగల అరుదైన ప్రతిభ ఆమె సొంతం. అందుకే సంగీత దర్శకులు ఎం.ఎస్. విశ్వనాథన్, సత్యం, కె.వి. మహదేవన్, చక్రవర్తి, ఇళయరాజా, ఎం.ఎం. కీరవాణి, ఏ.ఆర్. రెహమాన్ తదితరుల అభిమాన గాయనిగా నిలిచారు.

తెలుగు సినీ సంగీతంలో జానకి ఆలపించిన ఎన్నో గీతాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. *"మౌనమేలనోయి", *"మాటరాని మౌనమిది"*, *"ప్రియతమా"*, *"ఓం నమః"*, *"తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు"*, *"ఇందువదన"*, *"ఆకాశం ఏనాటిదో"*, *"సిరిమల్లె పువ్వా"*, *"వెన్నెల్లో గోదారి అందం"** వంటి ఎన్నో పాటలు తరతరాల సంగీతాభిమానులను అలరించాయి. జానకి నాలుగు సార్లు జాతీయ ఉత్తమ నేపథ్య గాయనిగా ఎంపికయ్యారు. తెలుగులో *1984లో విడుదలైన 'సీతార' చిత్రంలోని 'వెన్నెల్లో గోదారి అందం' పాటకు* ఆమె జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ పాట ఆమె గాన ప్రస్థానంలో అత్యంత గొప్ప మైలురాయిగా నిలిచింది. తమిళం, మలయాళంలో కూడా ఆమె జాతీయ అవార్డులు గెలుచుకున్నారు.

జాతీయ పురస్కారాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రభుత్వాల నుంచి అనేక రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. మొత్తం మీద 30కుపైగా రాష్ట్ర స్థాయి అవార్డులు, జీవిత సాఫల్య పురస్కారాలు ఆమెను వరించాయి. 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆలస్యంగా ప్రకటించారనే కారణంతో ఆమె సున్నితంగా తిరస్కరించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సుమారు ఆరు దశాబ్దాల పాటు భారతీయ సంగీత ప్రపంచాన్ని తన మధుర గానంతో మంత్రముగ్ధులను చేసిన జానకి 2017లో ప్రత్యక్ష సంగీత కచేరీలకు వీడ్కోలు పలికారు. మైసూరులో నిర్వహించిన సంగీత కార్యక్రమంతో తన వేదిక గాన ప్రయాణాన్ని ముగించారు. అయితే ఆమె ఆలపించిన వేలాది పాటలు నేటికీ సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఎస్. జానకి మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక మహోన్నత అధ్యాయం ముగిసింది. ఆమె గాత్రం ఇక వినిపించకపోయినా, ఆమె పాడిన వేలాది గీతాలు శాశ్వతంగా సంగీతాభిమానుల హృదయాల్లో మారుమోగుతూనే ఉంటాయి. ఆమె స్వరం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

# ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.

నిర్మాణంలో ఉన్న లోపాలను సకాలంలో సరిచేయకపోవడంతో సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చాయని సీఎం చెప్పారు. 2022 జూలై 14న వరదల కారణంగా కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని, ఇప్పటి వరకు అది పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని పేర్కొన్నారు. అనంతరం 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం ప్రాజెక్టులోని లోపాలను బహిర్గతం చేసిందని అన్నారు.

మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటు ఘటన తర్వాత కాదు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) కమిటీని ఏర్పాటు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలంగా లేవని ఎన్డీఎస్ఏ తన ప్రాథమిక, తుది నివేదికల్లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ప్రాజెక్టు ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణలో తీవ్ర లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ తేల్చిందని చెప్పారు. ఎన్డీఎస్ఏ నివేదికలో సూచించిన లోపాలను సరిచేయాలని నిపుణులు పదేపదే సూచించినప్పటికీ అప్పటి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని సీఎం ప్రశ్నించారు. ప్రారంభ దశలోనే సమస్యలను పరిష్కరించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదని అన్నారు. అధికారుల హెచ్చరికలు, నిపుణుల సూచనలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రాజెక్టుకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు.

# షాబాద్ ఆరుగురి హత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

**మొదటిపేజీ తరువాయి**

అలసిపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ఘటనలో ముగ్గురు అమాయక చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఘోరం జరిగినా రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టయినా లేదని హరీష్‌రావు విమర్శించారు.

**హోంమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యారు**

ఈ దారుణానికి సీఎం రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హోంమంత్రిగా రేవంత్ రెడ్డి పూర్తిగా ఫెయిల్ అయ్యారని, ఆయనకు కొంచెమైనా మానవత్వం ఉంటే తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అధికార పార్టీ ఒత్తిళ్లకు, అవినీతికి లొంగిపోవడం వల్లే నిందితుడికి బెయిల్ వచ్చిందని ఆరోపించారు. ఒక పోక్సో (POCSO) కేసు నిందితుడు ఇంతటి దారుణానికి ఒడిగడుతుంటే, నెల రోజుల పాటు పరారీలో ఉన్నా పోలీసులు అతడిని పట్టుకోలేకపోవడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు. నిందితుడికి ప్రభుత్వం, పోలీసులు పరోక్షంగా సహకరించారని ఆరోపించారు. ఈ కేసులో కేవలం ఒక ఎస్సైని సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని మండిపడ్డారు. ప్రస్తుతం పోలీసులు శాంతిభద్రతలను పక్కనబెట్టి, ల్యాండ్ సెటిల్‌మెంట్ల కోసం ఒక రాజకీయ వ్యవస్థగా మారిపోయారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

సబితా ఇంద్రారెడ్డి అడ్డగింతపై ఆగ్రహం.. బాధితురాలికి రూ. కోటి డిపాజిట్ చేయాలి

బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు తమ ప్రతాపం చూపిస్తూ అడ్డుకోవడాన్ని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. తప్పు చేసిన దొంగలకు, హంతకులకు సహకరిస్తున్న పోలీసులు, పరామర్శించడానికి వెళ్లే విపక్ష నేతలపై జులుం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను నిమిషాల్లో అరెస్ట్ చేసే పోలీసులు.. హంతకులను ఎందుకు పట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ ఘటనలో ఆ కుటుంబంలో ఒకే ఒక్క అమ్మాయి ప్రాణాలతో బతికిందని, ఆమె కూడా దివ్యాంగురాలని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆ దివ్యాంగ అమ్మాయి భవిష్యత్తు కోసం ఆమె పేరు మీద కోటి రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ (Fixed Deposit) చేయాలని హరీష్ రావు గట్టిగా డిమాండ్ చేశారు.

# వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు

- తీరిన జిల్లా రైతాంగ దశాబ్దాల సాగునీటి కల
- కృష్ణమ్మ ఒడికి చేరిన గోదావరి నదీ జలాలు
- సాకారమైన రైతాంగ దశాబ్దాల స్వప్నం
- వైరా రిజర్వాయర్‌ను ముద్దాడిన గోదావరి నదీ జలాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పం
- పట్టుబట్టి ప్రతిష్టాత్మక లింక్ కెనాల్ పూర్తి చేయించిన వైనం
- రూ.100 కోట్ల వ్యయంతో రాజీవ్ లింక్ కెనాల్
- రికార్డు సమయంలో పనులు పూర్తి చేసిన యంత్రాంగం
- రెండు జిల్లాల పరిధిలో లక్షలాది ఎకరాలకు భరోసా
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రైతులకు శాశ్వత పరిష్కారం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగ చరిత్రలో సరికొత్త సువర్ణాధ్యాయం లిఖించబడింది. ఈ ప్రాంత రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సాగునీటి కల ఎట్టకేలకు సాకారమైంది. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా పరుగులెత్తుకుంటూ వచ్చిన గోదావరి నదీ జలాలు వైరా రిజర్వాయర్‌కు విజయవంతంగా చేరుకున్నాయి. సుదీర్ఘ కాలంగా నీరు లేక వెలవెలబోయిన రిజర్వాయర్ ఇప్పుడు గోదావరి జలాల రాకతో జలకళను సంతరించుకుంది. పవిత్ర గోదావరి నదీ జలాలు వైరా జలాశయాన్ని ముద్దాడటంతో స్థానిక ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అద్భుత ఘట్టం జిల్లా వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించనుంది.

ఈ సుదీర్ఘ సాగునీటి స్వప్నం ఆచరణలోకి రావడానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన గట్టి సంకల్పం, పట్టుదలే ప్రధాన కారణం. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సాగునీటి పరంగా సస్యశ్యామలం చేయాలనేది ఆయన సుదీర్ఘ కాలపు ఆశయం. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మంత్రి తుమ్మల.. నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు. అధికారులు, ఇంజనీర్లను సమన్వయం చేస్తూ ఆటంకాలను అధిగమించారు. గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించాలనే ఆయన దృఢ నిశ్చయం నేడు విజయవంతంగా ముగియడంతో జిల్లా వ్యాప్తంగా ఆయనపై ప్రశంసల జల్లు కురుస్తోంది. గోదావరి జలాలను విజయవంతంగా మళ్లించడం కోసం ప్రభుత్వం సుమారు వంద కోట్ల రూపాయల భారీ వ్యయంతో రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టింది. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువను వైరా రిజర్వాయర్‌తో అనుసంధానించేలా ఈ సరికొత్త కాలువ రూపకల్పన జరిగింది. భారీ నిధులను కేటాయించడమే కాకుండా, పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. సాంకేతిక సవాళ్లను అధిగమిస్తూ, రికార్డు సమయంలో ఈ లింక్ కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేయడం విశేషం. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యత వల్లే ఇంత వేగంగా నీరు అందుబాటులోకి వచ్చింది. ఈ సరికొత్త కాలువ ద్వారా కేవలం ఒక ప్రాంతానికే కాకుండా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు అత్యంత నమ్మకమైన రీతిలో సాగునీరు అందనుంది. ఈ రెండు జిల్లాల్లోని వ్యవసాయ భూములకు శాశ్వతంగా సాగునీటి కొరతను తీర్చాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ఈ బృహత్తర ప్రణాళికను అమలు చేసింది. నిరంతరం నీటి ఇబ్బందులతో సతమతమయ్యే రైతులకు ఈ ప్రాజెక్ట్ ఒక పెద్ద భరోసాగా నిలిచింది. ఇకపై సాగునీటి కోసం వేరే వనరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా, రెండు పంటలకూ పుష్కలంగా నీరు అందుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంతో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల రంగ చరిత్రలోనే అత్యంత కీలకమైన మైలురాయి నమోదైంది. కృష్ణా బేసిన్ పరిధిలోకి వచ్చే వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి నది జలాలు చేరడం ద్వారా.. క్షేత్రస్థాయిలో కృష్ణా, గోదావరి నదుల అనుసంధాన ప్రక్రియ అద్భుతంగా సాకారమైంది. భౌగోళికంగా రెండు వేర్వేరు నదీ పరివాహక ప్రాంతాలను కాలువల ద్వారా కలపడం వల్ల భవిష్యత్తులో నీటి కొరత అనే మాటే రాదని సాగునీటి రంగ నిపుణులు కొనియాడుతున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం భవిష్యత్ నీటిపారుదల ప్రాజెక్టులకు దిక్సూచిగా నిలుస్తుంది.

నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరానికి నీరు అందక ప్రతి ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సాగర్ నుంచి వచ్చే నీరు టెయిల్ ఎండ్ (చివరి భూములు) కు చేరేసరికి సగం ఎండిపోయే పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు ప్రవహించడంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. సాగర్ ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరానికి సైతం పుష్కలంగా, తగిన సమయంలో నీరు అందించే మార్గం సుగమమైంది. దీనివల్ల చివరి భూముల రైతుల దశాబ్దాల సాగునీటి కష్టాలకు శాశ్వతంగా ముగింపు పడినట్లయింది.

ఈ ప్రాంతంలో దశాబ్దాలుగా తీవ్రమైన సాగునీటి ఇబ్బందులు, అకాల వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండేవి. సకాలంలో వర్షాలు పడక, చెరువుల్లో నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా చితికిపోయేవారు. అలాంటి కరువు పీడిత నేలకు ఇప్పుడు గోదావరి జలాలు ఒక సంజీవనిలా మారబోతున్నాయి. వర్షాలతో సంబంధం లేకుండా, నమ్మకమైన సాగునీటి వనరు అందుబాటులోకి రావడంతో రైతులు ఇకపై ధైర్యంగా వ్యవసాయం చేసుకోవచ్చు. ఈ పవిత్ర జలాలు భూగర్భ జల మట్టాన్ని కూడా పెంచి, తాగునీటి ఎద్దడిని సైతం నివారిస్తాయని అంచనా వేస్తున్నారు. గోదావరి జలాల రాకతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా వ్యవసాయ రంగంలో శాశ్వత స్థిరత్వం ఏర్పడటమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. తమ పొలాలకు గోదావరి నీరు వస్తుందని కలగన్న స్థానిక రైతాంగ లోకంలో నేడు సరికొత్త ఆశలు చిగురించాయి. కాలువల వెంట నీరు ప్రవహిస్తుంటే రైతులు గంగమ్మకు పూజలు చేస్తూ తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చాలనే ప్రభుత్వ సంకల్పం ఈ ప్రాజెక్టు ద్వారా నిజమైందని సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# గుండెలు పగిలే శోకం.. దైవాలగూడలో రాక్షసక్రీడ!

**మొదటిపేజీ తరువాయి**



కక్షతో ఈ ఘాతుకానికి పాల్పడిన రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడకు చెందిన రాజ్‌కుమార్ (28)పై మైనర్ బాలికను వేధించాడనే ఆరోపణలతో ఈ ఏడాది మే 16న పోక్సో కేసు నమోదైంది. ఆ కేసులో అరెస్టయిన అతడు అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. అయితే తనపై కేసు నమోదు చేయించిన కుటుంబంపై తీవ్ర కక్ష పెంచుకున్న రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి అమానుష హత్యాకాండకు తెరలేపాడు. మొదట షాబాద్‌లోని పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో నివసిస్తున్న 17 ఏళ్ల మైనర్ బాలిక ఇంటికి వెళ్లిన నిందితుడు ఆమెను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో బాలిక తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మ అడ్డుకోవడంతో వారిద్దరిపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో వారు అక్కడికక్కడే మృతి చెందారు.

అనంతరం మైనర్ బాలికను బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లిన రాజ్‌కుమార్, దైవాలగూడ సమీపంలోని అఖిల్‌సాగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి ఆమెను కూడా అత్యంత దారుణంగా హత్య చేశాడు. గొంతు కోసి హతమార్చిన అనంతరం అక్కడి నుంచి తన ఇంటికి వెళ్లాడు. అక్కడ కూడా అతడి క్రూరత్వం ఆగలేదు. తన భార్య సరిత (33), నాలుగేళ్ల కుమారుడు పరీక్షిత్, రెండేళ్ల కుమారుడు దైవీక్షిత్‌లపై కత్తితో దాడి చేసి ముగ్గురినీ హత్య చేశాడు. భార్యతో పాటు కన్నబిడ్డలను కూడా అత్యంత దారుణంగా చంపడం పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, మరో కుటుంబానికి చెందిన ముగ్గురిని వరుసగా హత్య చేయడంతో ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది.

ఈ ఘాతుకం అనంతరం రాజ్‌కుమార్ తన తండ్రి అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేసి "నేనే ఆరుగురిని చంపాను... నేను కూడా చనిపోతున్నా" అని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆందోళన చెందిన తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న షాబాద్ పోలీసులు రెండు ప్రాంతాలకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన సమాచారం అందుకున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి సంఘటన స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఘటనకు సంబంధించిన ప్రతి కోణాన్ని పరిశీలించాలని, నిందితుడిని వీలైనంత త్వరగా అరెస్టు చేయాలని దర్యాప్తు బృందాలను ఆదేశించారు. నిందితుడి కోసం ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడు రాష్ట్ర సరిహద్దులు దాటకుండా అన్ని జిల్లాలకు అప్రమత్తత సూచనలు జారీ చేసినట్లు సమాచారం.

ఇదిలా ఉండగా, ఈ దారుణ ఘటనతో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ షాబాద్-కంది ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిందితుడిని ఆలస్యం చేయకుండా పట్టుకోకపోతే మరిన్ని ప్రాణాలు తీసే ప్రమాదం ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. రాజ్‌కుమార్ ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి వివాహం చేసుకున్నట్లు సమాచారం. అయితే పోక్సో కేసు నమోదైన తర్వాత అతడి ప్రవర్తనలో తీవ్ర మార్పు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కేసు నుంచి బయటపడలేనన్న భావనతో పాటు తనపై ఫిర్యాదు చేసిన కుటుంబంపై పెంచుకున్న కక్ష చివరకు ఈ ఘోర హత్యలకు దారితీసినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే హత్యలకు దారి తీసిన పూర్తి కారణాలు, ముందస్తు ప్రణాళిక, నిందితుడి కదలికలపై పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఒకే రాత్రిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, అందులో ఇద్దరు చిన్నారులు ఉండడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నిందితుడి కోసం పోలీసుల ముమ్మర గాలింపు కొనసాగుతుండగా, ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. షాబాద్‌లో చోటుచేసుకున్న ఈ సామూహిక హత్యల ఘటన రాష్ట్రంలో ఇటీవల కాలంలో జరిగిన అత్యంత దారుణ నేరాల్లో ఒకటిగా నిలిచింది.





# 117 సీట్లు కాదు.. కాంగ్రెస్‌కు 7 సీట్లు కూడా రావు.!

**మొదటిపేజీ తరువాయి**

తీసుకున్న నిర్ణయాల వల్ల ఏర్పడిన కరువని కేటీఆర్ విమర్శించారు. కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భద్రాచలం మునిగిపోతుందనే కారణంతో నీటిని ఎత్తిపోకుండా ఉండటం అర్థరహితమని వ్యాఖ్యానించారు. 2022లో గోదావరిలో భారీ వరదలు వచ్చినప్పటికీ మేడిగడ్డకు, భద్రాచలానికి ఎలాంటి నష్టం జరగలేదని గుర్తుచేశారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ కక్షలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌పై కోపం ఉంటే కేసులు పెట్టాలని, విమర్శించాలని, కానీ రైతులపై ప్రతీకారం తీర్చుకోవద్దని కేటీఆర్ అన్నారు. రైతులను ఎండబెట్టి ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలను కూడా ఆయన ఖండించారు. సీఎం ఒకవైపు సర్వేలు నిర్వహిస్తూనే మరోవైపు 117 స్థానాలు గెలుస్తామని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తమకు అందిన సమాచారం ప్రకారం సీఎం నిర్వహించిన సర్వేల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 78కిపైగా స్థానాలు వస్తాయని తేలిందన్నారు. మరో 4 సర్వేల్లో కూడా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని నివేదికలు వచ్చాయని పేర్కొన్నారు. హరీశ్ రావుపై తరచూ వస్తున్న పుకార్లను కేటీఆర్ ఖండించారు. హరీశ్ రావు నికార్సైన నాయకుడని, కేసీఆర్ తయారు చేసిన సైనికుడని కొనియాడారు. పార్టీ మార్పుల గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదని, ఆయన ఇప్పటికే పలుమార్లు పార్టీలు మారారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తన పార్టీ ఖాతాలో ఉన్న నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో కాంగ్రెస్ పాత్రపై కూడా విమర్శలు గుప్పించారు. చివరగా ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు 117 స్థానాలు కాదు, ఏకంగా 7 స్థానాలు కూడా రావని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్..

**మొదటిపేజీ తరువాయి**

గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన తెలంగాణలో అమలవుతున్న రైల్వే అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మౌలిక సదుపాయాల విస్తరణపై విస్తృతంగా మాట్లాడారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరుతో అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రణాళికపై చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దేశంలో ఆధునిక రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రైల్వేలను కేవలం ప్రయాణ సాధనంగా కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అధునాతన సాంకేతికత, ప్రపంచ స్థాయి ప్రమాణాలు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్ కారిడార్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో పారిశ్రామిక, ఐటీ, విద్యా, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. వేగవంతమైన రైలు సేవలు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా మరింత వేగం పుంజుకుంటాయని తెలిపారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరిస్తూ రైల్వే బడ్జెట్‌పై కీలక వివరాలు వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్‌గా కేవలం రూ.880 కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికే దాదాపు రూ.5 వేల కోట్ల మేర రైల్వే ప్రాజెక్టులపై ఖర్చు చేస్తోందని చెప్పారు. గతంతో పోలిస్తే రైల్వే రంగంలో పెట్టుబడులు ఎన్నో రెట్లు పెరిగాయని, ఈ నిధులతో కొత్త ప్రాజెక్టులు, లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ, స్టేషన్‌ల ఆధునికీకరణ, భద్రతా చర్యలు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆధునిక ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విశాలమైన వెయిటింగ్ హాల్స్, అత్యాధునిక ప్లాట్‌ఫారాలు, మెరుగైన ఫుడ్ కోర్టులు, డిజిటల్ సమాచార వ్యవస్థలు, ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు, పార్కింగ్ సౌకర్యాలు, దివ్యాంగులకు అనుకూల వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ స్టేషన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత దక్షిణ మధ్య రైల్వేలో ఒక కీలక కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పునరాభివృద్ధి కార్యక్రమం గురించి కూడా ఆయన వివరించారు. మొత్తం 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అందులో ఇప్పటికే 260 స్టేషన్ల పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన స్టేషన్లలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రయాణికులకు విమానాశ్రయ స్థాయి సౌకర్యాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

తెలంగాణలో కూడా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. రాష్ట్రంలోని 40 రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ స్టేషన్లలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ సేవలు, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

# మాతా–శిశు సంక్షేమానికి కుటుంబ నియంత్రణ కీలకం

- **ప్రపంచ జనాభా దినోత్సవం.. కుటుంబ నియంత్రణపై అవగాహన**

**మేడ్చల్-మల్కాజిగిరి, జూలై 11(ప్రజా క్షేత్రం):**

కుటుంబ నియంత్రణ, గర్భధారణల మధ్య సరైన వ్యవధి పాటించడం ద్వారా తల్లి-శిశు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శనివారం అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభా కారణంగా ఆహారం, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక వనరులపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక సాధనాల వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని "ఆరోగ్యకరమైన మాతా-శిశు సంక్షేమం కోసం గర్భధారణల మధ్య సరైన వ్యవధి.. అనాలోచిత గర్భధారణల నివారణ" అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కుటుంబ సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ఆరోగ్య విద్యా కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవల ప్రోత్సాహ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన వైద్యశాఖ ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఒక్క ఆడపిల్లతో కుటుంబ నియంత్రణ చేసుకున్న దంపతులకు రూ.1,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యాధికారులు డా. లావణ్య, డా. గీత, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్‌లకు 50 డయాబెటిస్ డిటెక్షన్ కిట్ల పంపిణీ

- **మధుమేహ నిర్ధారణకు లయన్స్ ముందడుగు**

**కాప్రా, జూలై 11(ప్రజా క్షేత్రం):**

మధుమేహాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320హెచ్ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడ లయన్స్ భవన్‌లో 50 డయాబెటిస్ డిటెక్షన్ కిట్లను జిల్లా వ్యాప్తంగా ఉన్న లయన్స్ క్లబ్‌లకు పంపిణీ చేశారు. ప్రతి క్లబ్ తమ పరిధిలో మధుమేహ నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

కార్యక్రమానికి జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ వైస్ జిల్లా గవర్నర్ డి. లింగా రెడ్డి, జిల్లా ముఖ్య సలహాదారు మనోహర్ రెడ్డి, కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు, డాక్టర్ ఎన్. దేవి సుష్మ పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి, గ్లోబల్ కాజెస్ కన్వీనర్ కొత్తపల్లి రాంబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మధుమేహంపై అవగాహన పెంచడంతో పాటు ముందస్తు నిర్ధారణకు ఈ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా గవర్నర్ అశోక్ కుమార్ స్వైన్ మాట్లాడుతూ కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ గత 25 ఏళ్లుగా నిరుపేదలకు అందిస్తున్న వైద్య సేవలను ప్రశంసించారు. ట్రస్ట్ అభివృద్ధికి కృషి చేసిన లయన్ రియాజ్ అహ్మద్ ఖాన్, చంద్రశేఖర్, పిల్లి, రవిశంకర్ రాజులను అభినందించారు.

కొత్త రామారావు మాట్లాడుతూ ట్రస్ట్ హాస్పిటల్ ద్వారా మరిన్ని వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నూతన సభ్యులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని లయనిజం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీజినల్, జోన్ చైర్మన్లు, వివిధ లయన్స్ క్లబ్‌ల పదాధికారులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పూరి, కొల్హాపూర్ యాత్రలకు ప్రత్యేక బస్సులు

**కాప్రా,జులై 11 (ప్రజా క్షేత్రం):**

ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనం కోసం టీజీఎస్ఆర్టీసీ కుషాయిగూడ డిపో ప్రత్యేక టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయాణికులు, భక్తుల కోరిక మేరకు పూరి, కొల్హాపూర్ యాత్రలకు సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ తెలిపారు.

ఈ నెల 25న ప్రారంభమయ్యే ఆరు రోజుల పూరి యాత్రలో అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం, అరసవెల్లి, శ్రీకూర్మం, కోణార్క్, పూరి, విజయవాడ, ద్వారకా తిరుమల క్షేత్రాలను సందర్శించనున్నారు. ఈ యాత్ర టికెట్ ధర రూ.6,500గా నిర్ణయించారు.

ఈ నెల 18న ప్రారంభమయ్యే మూడు రోజుల కొల్హాపూర్ యాత్రలో గానుగాపూర్, తుల్జాపూర్, కొల్హాపూర్, పండరీపూర్ పుణ్యక్షేత్రాలను దర్శించనున్నారు. ఈ యాత్ర టికెట్ ధర రూ.3,500గా నిర్ణయించారు.

భోజనం, వసతి ఖర్చులను ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఆసక్తి గల భక్తులు ముందస్తు రిజర్వేషన్ల కోసం 9603549388 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.




# కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటమే మార్గం

**సంస్థాన్ నారాయణపురం, జులై 11(ప్రజాక్షేత్రం)**




కార్మికుల హక్కుల పరిరక్షణకు శ్రమ చట్టాలు అమలు, కనీస వేతనాల పెంపు కోసం కార్మికుల ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో జరిగిన ఏఐటీయూసీ నాలుగవ మహాసభల అరుణ పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలు అమలవుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే చర్యలు ఆందోళన కరమని పేర్కొన్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఇమ్రాన్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కనీస వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానాలను తగ్గించి శాశ్వత ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఏఐటీయూసీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని ప్రతి కార్మికుడిని సంఘటితం చేసి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని, కార్మికుల ఐక్యత తోనే హక్కును సాధ్యమవుతాయని కార్మికుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, దుబ్బాక సంజీవ, పూలమోని గిరి, జనగాం శంకర్, పాలకూర లక్ష్మమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులు, ట్రాక్టర్ యూనియన్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఐ ఎన్ టి యు సి నుండి ఏఐటీయూసీ లో చేరిక సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో జరిగిన ఏఐటీయూసీ మండల మహాసభల సందర్భంగా ఐఎన్టీయూసీ నుండి పూలమాని శంకర్, దుర్గం ప్రభాకర్ లు ఏఐటీయూసీ చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితులై చేరుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో చేరారు.



# అమెరికా వెళ్లిన ఓనర్..ఇంట్లో చోరీ..!

**కోటగిరి, జులై11(ప్రజాక్షేత్రం):**

ఇంటి ఓనర్ అమెరికా వెళ్లగా దొంగలు ఆ ఇంటిని దోచిన ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రం లో చోటుచేసుకుంది. కోటగిరి ఎస్సై శ్రీనివాస్,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోటగిరి మండల కేంద్రానికి చెందిన దొప్పల పూడి శ్రీధర్ నెల రోజుల క్రితం అమెరికా వెళ్లారు. గత నెల ఒకటో తారీఖున ఆయన కూతురు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లింది. ఆమె తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగల గొట్టి ఉండటం చూసి షాకైంది. వెంటనే స్థానికులకు పోలీసుకలు ఆమె సమాచారం ఇవ్వగా అక్కడకు చేరుకున్న పోలీసులు స్థానికులు ఇంట్లో దొంగలు పడి బీరువా తాళం పగల గొట్టి అందులోని 2 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. ఇంటి ఓనరైన శ్రీధర్ కూతురు చందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించామని దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై అన్నారు. ఇండ్లకు తాళం వేసి ఎక్కువరోజులు ఊరెళ్లే వారు పోలీసులకు, ఇంటిపక్కవాళ్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఏఐటీయూసీ నూతన అధ్యక్షులు పూలముని శంకర్ కార్యదర్శి దుబ్బాక సంజీవ ఎన్నిక

**చౌటుప్పల్ జూలై 11(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ గార్ల నాయకత్వంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు పూలమోని శంకర్ ఉపాధ్యక్షులు మంచాల సైదులు ప్రధాన కార్యదర్శి దుబ్బాక సంజీవ సహాయ కార్యదర్శి జనగాం శంకరయ్య కోశాధికారి జనగాం ఎట్టయ్య కార్యవర్గ సభ్యులుగా పూలముని యాదగిరి, దుబ్బాక పెద్దలు కొప్పు సుధాకర్ పాలకూర లక్ష్మమ్మ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.







# అంతారంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**చేవెళ్ల జులై 11(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులతో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శనివారం సర్పంచ్ జుట్టు రామస్వామి ప్రారంభించారు. నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్, ఏఈ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి నామ శ్రీకాంత్, కారోబార్ నరేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నర్రి మల్లేశం ఎన్నిక

**సంస్థాన్ నారాయణపురం, జులై 11(ప్రజాక్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా మల్లారెడ్డిగూడెం గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా నర్రి మల్లేశం ఎన్నికయ్యారు. పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంతో గ్రామ కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కార్యకర్తలు నర్రి మల్లేశంకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నర్రి మల్లేశం మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి గ్రామ శాఖ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు సాగుతానని చెప్పారు. గ్రామ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీని గ్రామంలో మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ, నర్రి మల్లేశం సేవా దృక్పథం కలిగిన నాయకుడని, ఆయన నాయకత్వంలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడు నర్రి మల్లేశంకు అభినందనలు తెలియజేశారు.

## పోక్సో కేసులకు తెలంగాణ అడ్డాగా మారింది:ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- **దైవాలగూడలో ఆరుగురిని హత్య చేసిన పోక్సో కేసు నిందితుడు**
- **బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతల అరెస్ట్**
- **నిందితుడు ఇప్పటికీ పరారీలో ఉండటం దారుణమన్న ప్రవీణ్ కుమార్**

**శంకర్ పల్లి జులై 11(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో పోక్సో కేసు కక్షతో... ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ కేసు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పటోళ్ల కార్తీక్ రెడ్డి వంటి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో ఈ అరెస్టులు జరిగాయి. ఈ నేపథ్యంలో, బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రం పోక్సో కేసులకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. ప్రభుత్వం నిందితుడిని అరెస్టు చేయకుండా బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. నిందితుడు ఇంకా పరారీలో ఉండటం దారుణమని అన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్ర రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మాన గారి గోవర్ధన్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్, బిఆర్ఎస్ నాయకులు వాసుదేవ్ కన్న, ప్రభు, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# భైంసా వంతెన కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**నిర్మల్ జిల్లా జూలై 11(ప్రజాక్షేత్రం):**



భైంసా పట్టణంలో శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక ఎన్ఆర్ గార్డెన్ సమీపంలో ఉన్న వంతెన కింద ఒక పురుషుడి మృతదేహం పడి ఉండటాన్ని ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు గమనించారు. వంతెన కింద నిర్జీవంగా పడి ఉన్న వ్యక్తిని చూసి ఆందోళనకు గురైన వారు, వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భైంసా పోలీసులు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అది ఎవరిదనే కోణంలో స్థానికులను విచారించారు. అయితే మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో అతడు ఎవరనేది తక్షణమే గుర్తించడం సాధ్యం కాలేదు. మృతుడు ఎవరు? ఏ ప్రాంతానికి చెందినవాడు? ఇక్కడికి ఎలా వచ్చాడు? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.ఆ వ్యక్తి మరణానికి గల కారణాలు కూడా ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. మృతదేహం లభ్యమైన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతుండటంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

# కాలే యాదయ్యపై ఆగ్రహం.. తిరగబడ్డ ప్రజలు

- ధర్నా వేదికపై ఉద్రిక్తత.. పరుగెత్తిన ఎమ్మెల్యే కాలె యాదయ్య
- తృటిలో తప్పించుకున్న కాలె యాదయ్య..
- కొనసాగుతున్న బాధిత కుటుంబాల ఆందోళన..
- ఘటనాస్థలికి చేరుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి



**షాబాద్, జూలై 11(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండలంలో జరిగిన ఘటనలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నా శనివారం ఉద్రిక్తంగా మారింది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్దఎత్తున ఆందోళన కొనసాగిస్తుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేను చూసిన వెంటనే మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు తమకు న్యాయం చేయలేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపిస్తూ ఎమ్మెల్యేను నిలదీశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చుట్టుముట్టేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల ఆగ్రహం మరింత పెరగడంతో ఎమ్మెల్యే కాలె యాదయ్య అక్కడి నుంచి తృటిలో తప్పించుకుని తన అనుచరులు, పోలీసుల సహాయంతో వేగంగా బయటకు వెళ్లిపోయారు. కొంత దూరం వరకు పరుగెత్తుకుంటూ వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనతో ధర్నా ప్రాంతంలో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఎమ్మెల్యే వెళ్లిపోయిన అనంతరం కూడా మృతుల కుటుంబ సభ్యులు తమ నిరసనను విరమించకుండా కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ధర్నా ప్రాంతానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి సమస్యలను విన్న కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ధర్నా ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



## సంస్థాన్ నారాయణపురం పుట్టపాక చేనేత సంఘాలకు డైరెక్టర్ల ఎన్నికలు

**సంస్థాన్ నారాయణపురం, జులై 11(ప్రజాక్షేత్రం):**

సంస్థాన్ నారాయణపురం మండలంలోని మూడు చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు శుక్రవారం అధికారులు నిర్వహించారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో 9 మంది డైరెక్టర్ల కోసం 27 మంది పోటీ చేశారు. అందులో గోశిక స్వామి, పగిడిమర్రి విష్ణు, మెకాని యాదగిరి, సూరపల్లి రాములు, వంగరి రఘు, దోర్నాల అంజయ్య, చిలుకూరి శ్రీను, దువ్వ విజయలక్ష్మి, సంగిశెట్టి అనంత లు డైరెక్టర్లుగా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రణయ్ కుమార్ ప్రకటించారు. అలాగే పుట్టపాక గ్రామంలో రెండు సంఘాలకు ఎన్నికలు జరిగాయి. పుట్టపాక సిల్క్ హ్యాండ్లూమ్ సొసైటీ కి జరిగిన ఎన్నికల్లో డైరెక్టర్లుగా కర్నాటి శ్రీనివాస్, కొలను ధనుంజయ, కొలను వెంకటేశ్వర్లు, గజం యాదగిరి, గజం సత్యనారాయణ, గంజి కృష్ణయ్య, దోర్నాల విశ్వేశ్వర్, మిర్యాల శ్రీనివాసులు, రాపోలు బాలసుబ్రమణ్యం, రావిరాల శ్రీనివాస్, గజం యాదమ్మ, మిర్యాల దుర్గమ్మ లు గెలుపొందినట్లు ఎన్నికల అధికారి రమేష్ బాబు ప్రకటించారు. పుట్టపాక లోని భావన రుషి సహకార సంఘంలో జరిగిందా ఎన్నికల్లో డైరెక్టర్లుగా కొలను సుజాత, గజం మురళి, సామల గణేష్, సారాణి బిక్షమయ్య, గజం పాపయ్య, పిల్లలమర్రి ముత్యాలు, గూడ యాదగిరి, సామల విజయలక్ష్మి, గజం పుష్పలత లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రమాదేవి ప్రకటించారు. ఈ సంఘాలకు చైర్మన్ లను ఎన్నుకోవడానికి మూడు రోజులు అవకాశం కల్పించారు.

## జిల్లా దాటి రాష్ట్ర స్థాయి పోటీల వైపు..

**నిర్మల్ జిల్లా జూలై 11(ప్రజాక్షేత్రం):**



గ్రామీణ క్రీడాకారులు పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని సారంగాపూర్ మండలం చించోలి (బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అల్లకుండ విశాల్ నిరూపించాడు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విశాల్.. రాష్ట్ర స్థాయి 'ఆత్యా పత్యా' పోటీలకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విశాల్ అద్భుతమైన ఆటతీరుతో రాణించి, క్రీడా విశ్లేషకుల ప్రశంసలు అందుకున్నాడు. జిల్లా వ్యాప్తంగా కనబరిచిన అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా అతడిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు క్రీడా విభాగం అధికారులు వెల్లడించారు.గ్రామీణ ప్రాంత పాఠశాల నుంచి ఒక విద్యార్థి జిల్లా స్థాయిలో రాణించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు తోటి విద్యార్థులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక అభినందన సభలో విశాల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, విశాల్ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు

## ప్రకాష్ నగర్ లోని బొడ్రాయి ప్రక్కన నిర్మిస్తున్న మసీదు నిర్మాణం వెంటనే నిలిపివేయాలి.

**శంషాబాద్ జులై10(ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ మున్సిపల్ సర్కిల్ పరిధి ప్రకాష్ నగర్ లోని బొడ్రాయి కమిటీ గుడి ఆవరణలో బస్తీ వాస్తులం కూర్చొని ఒక తీర్మానం చేయడం జరిగిందన్నారు.బొడ్రాయి పక్కన గల సర్వేనెంబర్.124/1ఏ,124/2ఏ లో ఉన్న భూమి యజమాని ఇప్తే కారు షరీఫ్ తన భూమి ప్రకాష్ నగర్ కాలనీ పోతురాజు గుడి పక్కన ఎలాంటి మజీదు లేకుండా ఉన్నది.ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో కొత్తగా ఒక మజీద్ కడుతున్నారు.తన భూమిలో మసీదుకు ఎలాంటి పర్మిషన్లు లేదు,పోతురాజు గుడి ప్రక్కన కట్టడం ఇది హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా భావిస్తూ షరీఫ్ ఇప్పే కార్ షరీఫ్ ను కలవడం జరిగిందన్నారు.తాను మజీదును అక్కడే నిర్మిస్తానని చెప్పడం జరిగింది.ఇప్పటివరకు బస్తీలలో కలిసిమెలిసిగా ఉన్న మేము భవిష్యత్తులో హిందూ ముస్లిం భావాలకు దెబ్బతిన్న విధంగా ఉన్నందున ఇక్కడ ఎలాంటి ప్రభుత్వ పరిమిషన్ లేకుండా నిర్మించడానికి వ్యతిరేకిస్తున్నాము అన్నారు.మసీదు నిర్మాణం ఇలాగే కొనసాగితే ప్రభుత్వం అధికారుల ఆఫీసుల ముందు పోరాటం చేయాలని నిర్ణయించుకోవడం జరిగినది.ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే మజీద్ నిర్మాణాన్ని ఆపేయగలరని కోరారు.అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుంటే ఆర్డీఓ,కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుంది అని తీర్మానించడం జరిగింది.ఈ కమిటీలో నర్ర పాండు,నర్ర యాదగిరి,నర్రగిరి,నర్ర శ్రీనివాస,నర్ర రామారావు,నర్రా బాబు,మక్కల విజయ్,ఎం.చంద్రశేఖర్,ఎమ్.మహేష్,ఎం ప్రేమ్ కుమార్,ఎం రజినీకాంత్,వి.సందీప్,ఎం రాజు,జెలేందర్,ఎం శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలించిన బర్ల మధుకర్

**కోటగిరి, జులై 11(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కోటగిరి సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్ శనివారం పరిశీలించారు. కోటగిరి తహసిల్దార్ గంగాధర్ తో కలిసి మండల కేంద్రంలో ఎస్ఐఆర్ సర్వే నిర్వహిస్తున్న బిఎల్ఓ ల వద్ద పరిస్థితిని తెలుసుకున్నారు. ఎస్ ఐ ఆర్ ఫామ్ లను ఓటర్లకు అందించి ఫారంలను ఎలా భర్తీ చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చందర్, జిపి సెక్రెటరీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## "చారిత్రక ఫిరంగి నాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత..

- శంషాబాద్, సాతం రాయి గ్రామాలలో ఫిరంగినాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..
- నాలా ప్రవాహానికి అడ్డుగా ఏకంగా ప్రహరీ గోడ నిర్మాణం..

**శంషాబాద్ జులై10(ప్రజాక్షేత్రం):**

నిజాం కాలం నాటి చారిత్రక 'ఫిరంగి నాలా' రంగారెడ్డి జిల్లాలో తీవ్ర కబ్జాలకు గురవుతోంది. షాబాద్ మండలం చందన్‌వెల్లి నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు దాదాపు 85 కిలోమీటర్ల పొడవున ప్రవహించే ఈ కాలువను, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు, ప్రహరీలు నిర్మిస్తున్నారు. శంషాబాద్ మండలంలోని శాతంరాయి,శంషాబాద్ లోని సదరన్ మెగా టౌన్ షిప్ వెంచర్ పరిధిలో ఫిరంగినాలను స్థానికులతో కలిసి పరిశీలించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ నగరంపై వరద ప్రభావం తగ్గడానికి నిర్మించిన ఫిరంగి నాల షాబాద్ మండలంలో చందనవెల్లి గ్రామంలో మొదలుకొని ఇటుపక్క ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు 84 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా నీరు అందించే ఫిరంగి నాల కాలువపై నేడు అభివృద్ధి పేరిట భూ బకాసురుల కబంధహస్తాల్లో కనుమరుగుతున్న వైనం పట్ల విచారం వ్యక్తం చేశారు. సాతంరాయి గ్రామంలో ఫిరంగినాలను పూడ్చి వేసి ఇటు అపర్ణ కన్స్ట్రషన్ మరోపక్క వసుంధర కన్స్ట్రక్షన్స్, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ప్రకృతి వనరులపై రియల్ ఎస్టేట్, అభివృద్ధి పేరిట కనుమరుగవుతున్న ఫిరంగినాలపై ఇటు రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఎవరైతే ఆక్రమణలకు పాల్పడ్డారో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఫిరంగి నాలను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు నీరు అందే విధంగా చూడాలని నాలాలో ఎలాంటి మురుగునీరు చేరకుండా పరిరక్షించాలని డిమాండ్ చేశారు.



## కొండ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో బండి సంజయ్ జన్మదిన సేవా కార్యక్రమం

**నిర్మల్ జిల్లా జూలై 11(ప్రజాక్షేత్రం):**

భైంసా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని భైంసా పట్టణంలో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర మీడియా కోకన్వీనర్ కొండ సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను స్వయంగా కలిసి వారికి పండ్లు, బ్రెడ్, జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండ సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న బండి సంజయ్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలోని పేద, బలహీన వర్గాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పేద కుటుంబాలతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, అవసరమైన వారికి తోడ్పాటు అందించారు. ఈ సేవా కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



## తృటిలో తప్పిన ముప్పు డ్రైనేజీలో పాఠశాల బస్సు

**నిర్మల్ జిల్లా జూలై 11(ప్రజాక్షేత్రం):**

భైంసా స్థానిక రహదారుల దుస్థితికి అద్దం పడుతూ పట్టణంలో శనివారం ఒక ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. పట్టణంలోని వెంకటేశ్వర ఆసుపత్రి సమీపంలో ప్రయాణిస్తున్న ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి, రోడ్డు పక్కనే తెరిచి ఉన్న డ్రైనేజీ గుంతలోకి దూసుకెళ్లింది. బస్సు వెనుక చక్రం ఆ లోతైన డ్రైనేజీలో తీవ్రంగా దిగబడటంతో వాహనం ఒక పక్కకు ఒరిగింది. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది. విద్యార్థులు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు సాధారణంగా విద్యార్థులతో కిక్కిరిసిపోయే ఆ పాఠశాల బస్సు, ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడం గమనార్హం. బస్సు కేవలం డ్రైవర్, క్లీనర్‌తో ప్రయాణిస్తుండటంతో ఒక పెద్ద ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. ఒకవేళ బస్సు నిండా పిల్లలు ఉండి ఉంటే పరిస్థితి మరెంత భయానకంగా ఉండేదోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఘటనా స్థలానికి చేరుకుని, బస్సులో పిల్లలు ఎవరూ లేరని నిర్ధారించుకున్నాకే ఊపిరి పీల్చుకున్నారు.



# ఓటు హక్కును కాపాడుకుందాం.. 'ఎస్ఐఆర్' ఫారాలు సమర్పిద్దాం!

**మొయినాబాద్,జులై 11(ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని, అందుకోసం ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను గడువు తేదీలోగా తప్పనిసరిగా సమర్పించాలని 8వ వార్డు కౌన్సిలర్ ధవల్గారి గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సకాలంలో ఈ ఫారాలను పూర్తి చేసి అధికారులకు అందజేయడం ద్వారా తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ టీవీ కళాకారుడు బిత్తిరి సత్తి (చేవెళ్ల రవికుమార్) పాల్గొని తనదైన శైలిలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# 'ఎస్ఐఆర్' హెల్ప్‌డెస్క్.. సేవలను సద్వినియోగం చేసుకోవాలి!

- **మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి**

**మొయినాబాద్,జులై 11(ప్రజాక్షేత్రం):**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు సహాయం అందించేందుకు చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను, హెల్ప్ డెస్క్ నిర్వహణను శనివారం ఆమె మున్సిపల్ కమిషనర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని ప్రతి అర్హ ఓటరు తమ ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాన్ని సంబంధిత బూత్ లెవల్ అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ హెల్ప్‌డెస్క్ సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం కూడా మున్సిపల్ కార్యాలయంలో ఈ హెల్ప్ డెస్క్, ఆన్‌లైన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా తమ ఫారాలను సమర్పించాలని, ఈ సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్లు ఉమేందర్, వెంకటేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# రవీంద్రభారతిలో వరకవి సిద్ధప్ప జయంతి వేడుకలు

- **మంబాపూర్‌కు చెందిన కేవీఎం వెంకట్‌కు విశిష్ట ప్రతిభ పురస్కారం**

**పెద్దేముల్,జూలై 11 (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరకవి సిద్ధప్ప జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ట్రస్ట్ చైర్మన్ ఇటిక్యాల వీరయ్య ప్రజాపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్య, సాహిత్యం, కళలు, సామాజిక సేవ, ప్రజా జీవితం తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రతిభావంతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన కేవీఎం వెంకట్ తన విశిష్ట సేవలకు గుర్తింపుగా "విశిష్ట ప్రతిభ పురస్కారం" అందుకున్నారు. ప్రముఖ రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ప్రసాద్, డాక్టర్ మున్నెల్లి శివశంకరయ్య, కవయిత్రి మొల్ల మాంబ సాహిత్య ప్రచార సమితి అధ్యక్షుడు ఆముదాల మురళి శతావధాని చేతుల మీదుగా ఆయనకు శాలువా, జ్ఞాపికతో పాటు పురస్కారం అందజేశారు.ఈ సందర్భంగా వరకవి సిద్ధప్ప సాహిత్య సేవలను, సమాజ చైతన్యానికి ఆయన అందించిన విశేష కృషిని వక్తలు కొనియాడారు. సమాజ అభ్యున్నతికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ట్రస్ట్ చైర్మన్ ఇటిక్యాల వీరయ్య ప్రజాపతి తెలిపారు.ఇటువంటి సత్కారాలు యువతకు స్ఫూర్తినిస్తూ సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కేవీఎం వెంకట్‌కు విశిష్ట ప్రతిభ పురస్కారం లభించడం పట్ల తాండూరు కవయిత్రి మొల్ల కళావేదిక సభ్యులు, సాహితీవేత్తలు, ఆత్మీయులు, మంబాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవి రామకృష్ణ, డాక్టర్ రమణమ్మతో పాటు పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.



# గోదావరి జలాలతో నిజాంసాగర్ ప్రాజెక్టును నింపాలి

- **వర్షాలు కురవక ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలి**
- **నిజాంసాగర్ నింపేందుకు పోచారం ప్రత్యేక చొరవ చూపాలి**
- **బి ఆర్ ఎస్ నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు**

**కోటగిరి,జులై 11(ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలతో తక్షణమే నిజాంసాగర్ ప్రాజెక్టును నింపాలని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో పదేపదే అబద్ధాలను చెబుతూ ఆ అబద్ధాలను నిజాలను చేసేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని రైతులకు ఉపయోగపడే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాలేశ్వరం కాదు కూలేశ్వరం అని విమర్శలు చేసినప్పుడే ఆ పార్టీ కాలేశ్వరంపై ఎంత కక్షపూరితంగా ఉందో అర్థమైంది అన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టుని ప్రారంభించి గోదావరి జలాలను ఎత్తిపోస్తే తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుని ప్రారంభిస్తే కెసిఆర్ కు ఆ ఘనత దక్కుతుందని కాంగ్రెస్ కాలేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ పార్టీ పైన కెసిఆర్, కేటీఆర్ పైన కక్ష ఉంటే తమ అందరి పైన కేసులు పెట్టుకోవాలని రైతులను మాత్రం ఇబ్బందులకు గురి చేయవద్దని విన్నవించారు. రైతుల జీవితాలతో చెలగాటం ఆడవద్దన్నారు. ఇప్పటికే వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే గోదావరి జలాలను వినియోగించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ దేశం గర్వించదగ్గ ప్రాజెక్టు అని గతంలో మంత్రి హోదాలో సభాపతి హోదాలో పోచారం శ్రీనివాసరెడ్డి అనేక పర్యాయాలు ప్రశంసించడం జరిగిందని ఇప్పుడు ఆ ప్రాజెక్టుపై ఎందుకు నోరు విప్పడం లేదు అని ఆయన ప్రశ్నించారు తక్షణమే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాలేశ్వరం ప్రాజెక్టు పై నోరు విప్పి గోదావరి జలాలతో నిజాంసాగర్ ప్రాజెక్టును నింపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో నియోజకవర్గ రైతులను కాలేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు తీసుకొని వెళ్లి గొప్పగా చెప్పిన పోచారం శ్రీనివాసరెడ్డి ఇప్పుడు పార్టీ మారగానే నీళ్లు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. రాబోయే రోజులలో సాగునీటి కోసం రైతుల పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు ఆందోళనలకు సిద్ధం కానున్నాయని స్పష్టం చేశారు. వారం రోజుల్లో బాన్సువాడ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతుల పంటలు ఎండుతున్నాయని తక్షణమే గోదావరి జలాలతో నిజాంసాగర్ ను నింపి రైతులను కాపాడాలి అని లేనట్లయితే రోడ్డెక్కి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి నార్ల రత్నకుమార్, మోర్ కిషన్, తేల్ల రవికుమార్, సూధం నవీన్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఫరూక్, వర్ని మండల నాయకులు జంగం చిన్న గంగప్ప, దాసు, కోటగిరి మండల నాయకులు గంగాప్రసాద్ గౌడ్, అరవింద్,బాబు పటేల్,కమ్మరి విజయ్,సందీప్,జలాల్,వడ్ల ఉమాకాంత్,యోగేష్, మంజునాథ్,సాయిలు,మాస్కుల దత్తు,శివ,పత్తి గజేందర్,మేత్రి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





# భువనగిరి–నల్గొండ రహదారిపై గుంతలను వెంటనే పూడ్చాలి సిపిఎం

**వలిగొండ జులై 11(ప్రజాక్షేత్రం):**

భువనగిరి-నల్గొండ ప్రధాన రహదారిలో అక్కంపల్లి నుంచి టేకులసోమారం వరకు ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం అక్కంపల్లి స్టేజి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో, కార్లలో ప్రయాణించే ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, పలువురికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన లేదని, స్థానిక ఎమ్మెల్యే కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని .

విమర్శించారు వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని, లేకపోతే పరిసర గ్రామాల ప్రజలతో కలిసి భారీ రోడ్డు దిగ్బంధనం చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దేముల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా... తట్టేపల్లి నారాయణగౌడ్ ఏకగ్రీవ ఎన్నిక

- **ఉపాధ్యక్షులుగా రాథోడ్ ఆనంద్ నాయక్**
- **మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎం.సునీత వెంకట్**
- **జనరల్ సెక్రటరీగా డి.అశోక్ కుమార్**
- **మహిళా ప్రధాన కార్యదర్శిగా సుమిత్రా రాథోడ్**
- **గ్రామాభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని నూతన కమిటీ వెల్లడి**

**పెద్దేముల్, జూలై 11 (ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండలంలోని గ్రామాల సర్వతోముఖ అభివృద్ధితో పాటు సర్పంచుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మండల సర్పంచుల సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.

సమావేశంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా తట్టేపల్లి నారాయణగౌడ్ (తట్టేపల్లి గ్రామ సర్పంచ్ ), ఉపాధ్యక్షుడిగా రాథోడ్ ఆనంద్ నాయక్ (కందనెల్లి తండా గ్రామ సర్పంచ్ )ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎం.సునీత వెంకట్ (మారేపల్లి గ్రామ సర్పంచ్ ), జనరల్ సెక్రటరీగా డి.అశోక్ కుమార్ (రేగొండి గ్రామ సర్పంచ్ ), ప్రధాన కార్యదర్శిగా సుమిత్రా రాథోడ్ (ఓమ్లానాయక్ తండా గ్రామ సర్పంచ్ )లను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడు తట్టేపల్లి నారాయణగౌడ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులందరూ ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు.నూతన కమిటీ సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# జుంటిపల్లి జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు "షీ" టీమ్ పై అవగాహన

- **సబ్ డివిజన్ "షీ"టీమ్ ఇంచార్జ్ ఎఎస్ఐ శేఖర్**

**యాలాల జూలై 11(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని జుంటిపల్లి జెడ్. పి. హెచ్. ఎస్. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్ పైన అవగాహన కల్పించారు శనివారం పోలీసులు. సబ్ డివిజన్ షీ టీమ్ ఇంచార్జ్ ఎఎస్ఐ శేఖర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు,బాలల భద్రతే మా లక్ష్యం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. మహిళలు, బాలలపై,జరుగుతున్న నేరాలు నిర్భ య చట్టం ,ఫోక్సో చట్టం గురించి వివరించారు.100 డయల్, షీ టీమ్ నం 181. సీసీ కెమెరాలు,గుడ్ టచ్,బాడ్ టచ్ , కార్మిక వ్యవస్థ,బాల్య వివాహ నిర్మూలన,కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం,ట్రాఫిక్ రూల్స్, బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు, గంజాయిని నిర్మూలన, డ్రగ్స్ నిషేధం పై విద్యార్థిని, విద్యార్థులకు, వివరించారు. జెండర్ ఈక్వాలిటీ,జండర్ హబ్ సెన్సిటివిటీ వంటి పలు వివిధ అంశాలపై విద్యార్థులకు, అవగాహన కల్పించారు. మంచి విలువలు కలిగి ఉండాలని తెలిపారు. ఆంటీ డ్రగ్1908, సైబర్ క్రైమ్స్ నం 1930, చైల్డ్ లైన్ 1098. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థుని విద్యార్థులు,షీ టీమ్ సభ్యులు రోహిణి పాల్గొన్నారు.

# శ్రీనివాస్ నగర్ పార్క్‌లో గ్రీన్ స్పిరిట్ సందడి..!

- **చెత్తకు చెక్..పచ్చదనానికి వెల్‌కమ్..!**
- **పార్కు పరిశుభ్రతకు కార్పొరేట్–స్వచ్ఛంద సంస్థల జోడీ**

**కుత్బుల్లాపూర్,జూలై 11 (ప్రజాక్షేత్రం):**

పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న తరుణంలో పర్యావరణ పరిరక్షణకు సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని చాటుతూ, నిజాంపేట సర్కిల్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ పార్క్‌లో శనివారం పార్క్ క్లీనింగ్, మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఒరాకిల్ సంస్థ వాలంటీర్ల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమం స్థానికుల్లో పర్యావరణంపై అవగాహన పెంచింది.

ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా భావించాలని అన్నారు. నేటి నగరాలు కాంక్రీట్ అడవులుగా మారుతున్న నేపథ్యంలో పార్కులు, ఖాళీ స్థలాల్లో పచ్చదనం పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడమే అసలైన సేవ అని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ఒరాకిల్ సంస్థ వాలంటీర్లు, నిజాంపేట సర్కిల్ పారిశుధ్య సిబ్బందితో కలిసి పార్కులో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత పనులు చేపట్టారు. అనంతరం పలు రకాల నీడ, పండ్ల, అలంకరణ మొక్కలను నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రజల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని బిక్షపతి యాదవ్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం సమాజానికి శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఒరాకిల్ వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, యువత, మహిళలు, సామాజిక కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ తరఫున బిక్షపతి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యమే సుస్థిర అభివృద్ధికి బలమైన పునాది అని ఆయన పేర్కొన్నారు.



# నిజమైన ఉద్యమకారులను ఎట్లా గుర్తిస్తారో చెప్పాలి

- సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు

**వలిగొండ జులై 11(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను ఎట్లా గుర్తిస్తారో చెప్పాలని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఉత్తరాంచల్ ఝార్ఖండ్ చతిస్గడ్ రాష్ట్రాల లో ఉద్యమకారులను ఎలా గుర్తించారు. వారికి ఎలాంటి సముచితమైన గౌరవం లభిస్తుందో అలానే తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉద్యమకారులను గుర్తించి గౌరవించి సముచితమైన స్థానం కల్పించాలని ఆయన అన్నారు .గత 12 సంవత్సరాల నుండి అనేక మంది ఉద్యమకారులు ఆర్థికంగా నష్టపోయి చనిపోయారని మరి కొంతమందిని నష్టపోక ముందే కాలయాపన చేయకుండా గుర్తించి గౌరవించాలని ఆయన అన్నారు ప్రభుత్వం వెంటనే అన్ని జిల్లాల కలెక్టర్లకు జైలు అధికారులకు పోలీస్అ ధికారులకు ఆదేశాలు జారీ చేసి నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని అన్నారు.

# సర్ ప్రక్రియను విజయవంతం చేయండి

- గడువులోగా ఫారాలు సమర్పించండి: తాండూర్ ఆర్డీఓ కే.అనిత
- హెల్ప్‌డెస్క్‌లలో బీఎల్‌వోలతో సందేహాల నివృత్తి
- 14వ తేదీలోపు పత్రాలు అందజేయాలని సూచన

**పెద్దేముల్,జూలై 11 (ప్రజాక్షేత్రం):**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను విజయవంతం చేసేందుకు ఓటర్లందరూ గడువు ముగిసేలోపు తమ ఫారాలను సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని తాండూర్ ఆర్డీఓ కే.అనిత పిలుపునిచ్చారు. చాలామంది ఓటర్లు ఫారాలు ఎలా నింపాలో తెలియక, ఇంకా గడువు ఉందనే భావనతో ఇంట్లోనే పత్రాలను ఉంచుకుంటున్నారని ఆమె తెలిపారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని,అక్కడ బీఎల్‌వోలు అందుబాటులో ఉండి ఫారాలు నింపడంలో సహాయం చేయడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పత్రాలను సమర్పించాలని సూచించారు.సర్ ప్రక్రియ గడువు సమీపిస్తున్నందున ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించాలని ఆర్డీఓ కోరారు."ఇంకా సమయం ఉంది" అనే నిర్లక్ష్య ధోరణి సరికాదని, ప్రతి ఓటరు జూలై 14వ తేదీలోపు అవసరమైన పత్రాలను బీఎల్‌వోలకు అందించాలని విజ్ఞప్తి చేశారు.జూలై 14 తర్వాత ఏఎస్‌డీ (ASD) జాబితా తయారీతో పాటు రేషనలైజేషన్ (Rationalisation) ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం ఆన్‌లైన్ ప్రక్రియ కూడా చేపట్టనున్నందున,ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఓటర్లందరూ గడువులోగా తమ ఫారాలు సమర్పించి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆర్డీఓ కే.అనిత కోరారు.


# కరీంనగర్ లో బండి సంజయ్ జన్మదిన వేడుకలు

- విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్, స్టేషనరీ పంపిణీ

**కరీంనగర్,జూలై 11 (ప్రజాక్షేత్రం):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం కరీంనగర్ నగరంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.మొదట 42వ డివిజన్ భగత్‌నగర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. అనంతరం ప్రజలకు పూలు, పండ్లు, ఔషధ మొక్కలను పంపిణీ చేస్తూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తదుపరి భగత్‌నగర్‌లోని పోలీస్ క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 60 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, షూస్, సాక్సులు, బెల్టులు, టైలు, బ్యాడ్జీలు, నోట్‌బుక్స్, పెన్నులు తదితర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి బండి సంజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం బండి సంజయ్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద రూ.934 కోట్ల నిధులు తీసుకువచ్చి నగర అభివృద్ధికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. అలాగే అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లు, అమృత్ పథకాల కింద రూ.470 కోట్ల నిధులు సమకూర్చి పలు అభివృద్ధి కార్యక్రమాలకు దోహదపడ్డారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో విద్యాస్ఫూర్తి పెంపొందించేందుకు, చదువుపట్ల ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. బండి సంజయ్ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.








# కరీంనగర్ లో బండి సంజయ్ జన్మదిన వేడుకలు

- విద్యార్థులకు స్కూల్ బ్యాగులు,షూస్,స్టేషనరీ పంపిణీ

**కరీంనగర్,జూలై 11 (ప్రజాక్షేత్రం):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం కరీంనగర్ నగరంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.మొదట 42వ డివిజన్ భగత్‌నగర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. అనంతరం ప్రజలకు పూలు, పండ్లు, ఔషధ మొక్కలను పంపిణీ చేస్తూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తదుపరి భగత్‌నగర్‌లోని పోలీస్ క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 60 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, షూస్, సాక్సులు, బెల్టులు, టైలు, బ్యాడ్జీలు, నోట్‌బుక్స్, పెన్నులు తదితర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి బండి సంజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం బండి సంజయ్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద రూ.934 కోట్ల నిధులు తీసుకువచ్చి నగర అభివృద్ధికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. అలాగే అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లు, అమృత్ పథకాల కింద రూ.470 కోట్ల నిధులు సమకూర్చి పలు అభివృద్ధి కార్యక్రమాలకు దోహదపడ్డారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో విద్యాస్ఫూర్తి పెంపొందించేందుకు, చదువు పట్ల ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. బండి సంజయ్ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.






# బిఆర్ఎస్ కార్యకర్తలు ఎస్ఐఆర్ సర్వేలో చురుకుగా పాల్గొనాలి

**కోటగిరి,జులై 11(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండలంలో జరిగే ఎస్ఐఆర్ సర్వే లో బిఆర్ఎస్,నాయకులు కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని మండల బిఆర్ఎస్ నాయకులు మోరే కిషన్, తేల్ల రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలోని వివిధ బూత్ లలో ఎస్ఐఆర్ సర్వేలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఓటర్లకు సర్వే ఫారాలను అందజేసి ఇలా నింపాలో వివరించి పూర్తిచేసిన సర్వే ఫారాలను బిఎల్ఓ లకు అందించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు కిషన్,రవి కుమార్ లు మాట్లాడుతూ...పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సర్వే ఫారాలను పంపిణీ చేయడంతో పాటు వాటిని పూర్తి చేయడం పట్ల ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్ సర్వేలో అర్హులైన ఏ ఒక్క ఓటరు ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులు కార్యకర్తలు తీసుకోవాలన్నారు. పార్టీ బూత్ ల వారిగా కేటాయించిన బిఎల్ఏలు తప్పనిసరిగా రోజువారి సర్వేలో భాగస్వాములు కావాలని సూచించారు. కోటగిరి విఠలేశ్వర ఆలయం వద్ద ఏర్పాటుచేసిన సర్వేను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు వడ్ల ఉమాకాంత్, గంగా ప్రసాద్ గౌడ్, యోగేష్,మంగలి విట్టల్,సందీప్,మంజునాథ్, మాస్కుల దత్తు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఓటర్ నమోదు కొరకు హెల్ప్ డెస్క్ మూడు రోజుల అందుబాటులో ఆదర్శ స్కూల్ లో ఉంటుంది

**జహీరాబాద్ జూలై 11 (ప్రజాక్షేత్రం):**

ఓటరు జాబితా సవరణ కోసం తెలంగాణ ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో సందేహాల నివృతి, ఫాం పూర్తి చేసేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయటం జరిగింది. మీ వివరాలను సరిచూసుకోవడానికి, కొత్త ఓటరు నమోదుకు లేదా తప్పులు సరిచేసుకోవడానికి సద్వినియోగం చేసుకోగలరు. ప్రక్రియ ముగిసేంతవరకు హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుంది అన్ని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.




# ప్రతి ఓటు విలువైనదే ఓటు హక్కు కాపాడుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పందెం భాస్కర్ యాదవ్

**మహేశ్వరం జూలై11 (ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం శంషాబాద్ జిహెచ్ఎంసి 64 డివిజన్ పాడి షరీఫ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పందెం భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో (ఎస్ఆర్ఐ).కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ.ఎస్ఆర్ఐ. (సార్) చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్-2026 స్పీడ్ పెంచిన అధికారులు...ఓటర్లపై ఫోకస్

- ఈరోజు ఫామ్...రేపటి ఓటు అంటూ అధికారుల విజ్ఞప్తి
- నిర్లక్ష్యం చేస్తే ఓటు ప్రమాదంలో..దుండిగల్ ఓటర్లకు అలర్ట్

**కుత్బుల్లాపూర్,జూలై 11 (ప్రజాక్షేత్రం):**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ )2026 ప్రక్రియలో కీలక ఘట్టమైన ఎన్యుమరేషన్ ఫామ్‌ల సేకరణపై ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించింది. ఇప్పటికే బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫామ్‌లు పంపిణీ చేయగా, ఇప్పుడు వాటిని గడువులోపు పూర్తి చేసి తిరిగి సమర్పించడం అత్యంత కీలకంగా మారింది. ఈ దశలో ఓటర్ల నిర్లక్ష్యం వారి ఓటు హక్కుపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ మాట్లాడుతూ, ప్రతి ఓటరు తనకు అందిన ఎన్యుమరేషన్ ఫామ్‌ను సరైన వివరాలతో నింపి వచ్చే రెండు నుంచి మూడు రోజుల్లోపు సంబంధిత బిఎల్ఓకు అందజేయాలని సూచించారు. సమర్పించిన వివరాల ఆధారంగానే డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధమవుతుందని, గడువులోపు ఫామ్‌లు ఇవ్వని వారి పేర్లు జాబితాలో లేకపోయే పరిస్థితి ఏర్పడవచ్చని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్2026 కేవలం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం మాత్రమే కాకుండా, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఖచ్చితత్వాన్ని పెంచే ప్రక్రియ అని అధికారులు పేర్కొంటున్నారు. అందుకే ప్రతి కుటుంబం ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని ఫామ్‌లను ఆలస్యం చేయకుండా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఓటరు తన ఓటు హక్కును సురక్షితంగా కొనసాగించుకోవాలంటే ఎన్యుమరేషన్ ఫామ్‌ను సకాలంలో బిఎల్ఓకు అందజేయడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. బిఎల్ఓ వివరాలు లేదా ఇతర సమాచారం కోసం ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌ను (https://voters.eci.gov.in/) సంప్రదించాలని సూచించారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

**వలిగొండ జులై 11(ప్రజాక్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో అంబేద్కర్ నూతన భవన నిర్మాణం కొరకు స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు రాపోలు పవన్ కుమార్ ఆధ్వర్యంలో మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్, జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి వినతిపత్రం అందజేసి వారు మాట్లాడుతూ... మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం లేకపోవడం వల్ల సామాజిక విద్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు తెలియజేయడానికి, ప్రజలకు సమావేశాలు ఇతర కార్యక్రమాలు నిర్వహణకు అంబేద్కర్ భవనం ఎంతో అవసరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో రేగులకుంట వద్ద ప్రభుత్వ స్థలం గుర్తించి అంబేద్కర్ భవన నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసి గాలికి వదిలేసినారని, ఇప్పటికైనా తక్షణమే మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు.



## పారదర్శక పాలనకు కాంగ్రెస్ పెద్దపీట:కేఎల్ఆర్

- **లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా సీఎంర్ఫ్,కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన కేఎల్ఆర్**

**మహేశ్వరం జులై 11 (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పాలనలో పారదర్శకతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.
ఇప్పటికే సీఎంర్ఫ్ , ఎల్ఓసి చెక్కులను రోగులకు అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి సర్కార్.. భవిష్యత్ లో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులకు బదులుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా డబ్బును బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుందని కేఎల్ఆర్ తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులను ఆపార్టీ నేతలు దుర్వినియోగం చేయటం, అవినీతి పాల్పడటం తెలిసిందే. అందుకే ప్రజాపాలనలో అవినీతి లేకుండా... ప్రభుత్వ సేవలు అందించేలా నేరుగా లబ్ధిదారులకే నగదు అందేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని శాఖాల్లో చర్యలు చేపట్టిందని లక్ష్మారెడ్డి చెప్పారు.అవినీతి అనకొండల భరతం పడుతున్న ప్రభుత్వం: కేఎల్ఆర్ పలు శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులను గుర్తించి ఏసీబీ రైడ్స్ చేసి పట్టుకుంటుంది తెలంగాణ ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక... సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అనేక మంది అవినీతి అధికారులను పట్టుకుని ఆస్తులను జప్తు చేసిందని కిచ్చెన్నగారు గుర్తు చేశారు. ప్రజాపాలనలో నిజాయతీ, నిబద్ధత, పారదర్శకతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేఎల్ఆర్ గుర్తు చేశారు. ఏశాఖలోనైనా అవినీతి అధికారులను పట్టిస్తే రూ. లక్ష బహుమతి ఇస్తానని గతంలోనే లక్ష్మారెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు.

## పుప్పాలగూడ శాఖ ఆధ్వర్యంలో మణికొండ ప్రాథమిక పాఠశాలకు టీవీ బహుకరణ

**శంషాబాద్ జులై11(ప్రజాక్షేత్రం):**

శ్రీ వాసవీ మాత ఆశీస్సులతో మేము అవోపా పుప్పాలగూడ కుటుంబ సభ్యులు మణికొండ పరిషత్ ప్రాథమిక పాఠశాలకు టీవీ బహుకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది ముఖ్య అతిథిగా హాజరై, అవ్వోప పుప్పలగూడ యూనిట్ సభ్యులతో కలిసి శాంసంగ్ ఎల్ఈడీ టీవీని ప్రారంభించారు. శంకర అన్నా, బాలలత ఐఏఎస్ మేడమ్ స్ఫూర్తిదాయకమైన కథ గురించి ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో పంచుకునారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలు విభిన్న నేపథ్యాల నుండి వస్తారు కాబట్టి, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా కష్టపడాల్సి వుంటుంధి పిల్లలకు స్ఫూర్తిదాయకమైన కథల గురించి చెప్పమని ఆయన ఉపాధ్యాయులతో అన్నారు. అవొప పుప్పలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణు మాధవ్, పిల్లలు మరియు ఉపాధ్యాయులు స్మార్ట్ టీవీని అభ్యసనం కోసం ఉపయోగించుకోవాలని, అలాగే పాఠశాలలోని వివిధ సందర్భాలలో దానిని వినియోగించుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. అవొప పుప్పలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణు మాధవ్, పిల్లలు మరియు ఉపాధ్యాయులు స్మార్ట్ టీవీని అభ్యసనం కోసం ఉపయోగించుకోవాలని, అలాగే పాఠశాలలోని వివిధ సందర్భాలలో దానిని వినియోగించుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమానికి పుప్పాలగూడ యూనిట్ సభ్యులు దారం భానుచందర్, ప్రధాన కార్యదర్శి, అప్పని యుగేందర్,కోశాధికారి, జె. సాయిరామ్ గారు,ఆర్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి,పందిరి కృష్ణ,పబ్బా మల్లేశం,దారం మల్లయ్య,బచ్చు రాము,భాస్కర్, కోటోరి ప్రకాష్,బాల రాజయ్య , షీలా కృష్ణ మూర్తి,టి నరేష్ ,జి నరేష్,అంధూరు దారం వేణు మాధవ్,అవోపా పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం భానుచందర్ , ప్రధాన కార్యదర్శి అప్పని యుగేందర్,కోశాధికారి. తదితరులు పాల్గొన్నారు.




## ఈ నెల 13న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కై కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన విజయవంతం చేయాలి..

- **నియోజకవర్గ అధ్యక్షుడు అలమనేటి గోపాల్..**

**శంషాబాద్ జులై11(ప్రజాక్షేత్రం):**



ఈ నెల 13వ తేదీన జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు అలమనేటి గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నియోజకవర్గ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# 9 రోజుల్లోనే రూ.99.04 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

- **రైతును కంటికి రెప్పలా కాపాడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే**
- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
- **వనపర్తి నియోజకవర్గంలో 92,115 మంది రైతులకు రైతు భరోసా**
- **రైతు సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని వ్యాఖ్య**

**వనపర్తి,జూలై 11 (ప్రజాక్షేత్రం):**

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతును కంటికి రెప్పలా కాపాడుతూ ప్రతి రైతు కుటుంబానికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చి రైతు కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ రైతు భరోసా నిధులను రికార్డు స్థాయిలో విడుదల చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70,40,286 మంది రైతులకు రూ.8,759.60 కోట్ల రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
వనపర్తి జిల్లాలో మొత్తం 1,83,011 మంది రైతులకు రూ.212.57 కోట్ల రైతు భరోసా నిధులు జమయ్యాయని తెలిపారు. ఇందులో వనపర్తి నియోజకవర్గానికి చెందిన 92,115 మంది రైతులకు కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ.99.04 కోట్లను వారి ఖాతాల్లో జమ చేయడం ప్రభుత్వం పనితీరుకు అద్దం పడుతోందన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పారదర్శకంగా నిధులు జమ కావడం ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు.
రైతు సంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతు భరోసాతో పాటు రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి రైతు ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు గతంలో అమలు చేసిన అనేక వ్యవసాయ రాయితీలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వరి, వేరుశనగ, కంది, ఆముదం వంటి పంటల విత్తనాలపై అందే సబ్సిడీలతో పాటు ఎరువులు, ట్రాక్టర్లు, రోటావేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, గొర్రెల పంపిణీ వంటి పథకాలపై ఇచ్చే సబ్సిడీలను రద్దు చేయడం వల్ల ఒక్కో రైతు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వ సహాయాన్ని కోల్పోయారని ఆరోపించారు.
ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని మళ్లీ గాడిలో పెట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రైతులకు అన్ని విధాలుగా భరోసా కల్పిస్తోందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, బోనస్, పంటల కొనుగోలు,



సాగునీటి సదుపాయాల కల్పన వంటి చర్యల ద్వారా రైతు జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని చెప్పారు.
"రైతు నవ్వితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. రైతు సంతోషమే కాంగ్రెస్ ప్రభుత్వ విజయానికి అసలైన కొలమానం. రైతు భరోసా నిధుల విడుదల రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ప్రత్యక్ష నిదర్శనం. ప్రతి ఎకరానికి, ప్రతి రైతు కుటుంబానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ నిలుస్తుంది. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం" అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.

## సోంపల్లి గ్రామంలో రోడ్లపై ఉన్న మట్టి కుప్పలను తొలగించాలని గ్రామ ప్రజలకు అవగాహన

**బూర్గంపాడు జూలై 11 (ప్రజాక్షేత్రం):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, సోంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సోంపల్లి గ్రామంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్లపై పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగించాలని సోంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు గ్రామ ప్రజలకు సూచించారు.వర్షాల కారణంగా రోడ్లపై మట్టి పేరుకుపోవడం వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. అలాగే రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి గ్రామస్థుడి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు రోడ్ల శుభ్రత, పారిశుధ్యం, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కాలువలను అడ్డుకునే మట్టి, చెత్తను తొలగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన గ్రామాన్ని నిర్మించవచ్చని సోంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పిలుపునిచ్చారు.

## సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి రూ 25 కోట్లు మంజూరు....

- **గజ్వేల్ అభివృద్ధిపై... సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి**
- **ప్రజా పాలనలోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యం**
- **నియోజకవర్గానికి 6వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు**
- **యంగ్ ఇండియా, తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరి**
- **గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్ /వర్గల్ జులై 11 (ప్రజాక్షేత్రం)**



గజ్వేల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుండగా, ప్రజా పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యపడుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. శనివారం మల్లారెడ్డిపల్లిలో సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ 25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ గజ్వేల్ కు రూ 200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సీఎం రేవంత్ రెడ్డి కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీయట్ లో మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు ఉదయం అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకోగా, నిరుపేద విద్యార్థులకు మంచి చదువు, నాణ్యమైన భోజనం అందించి భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుండగా, గజ్వేల్ కు రెండు విడతల్లో 6 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ రెండు లక్షల పంట రుణమాఫీ చేయగా, పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయడంతో పాటు రైతు భరోసా పథకం కింద రూ 12 వేలు ఖాతాలలో జమ చేసినట్లు స్పష్టం చేశారు. మధ్య దళారీలకు అవకాశం లేకుండా ప్రత్యేక యాప్ ద్వారా ఎరువులు కేటాయిస్తుండగా, సన్నధాన్యానికి రూ 500 బోనస్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు.
పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో రూ 10 లక్షలు రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు సిఎంఆర్ఎఫ్ తో రోగులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుండగా, నిరుద్యోగుల కోసం ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తూ విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి నిరుపేద కుటుంబాలకు మేలు చేస్తుండగా, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్ రెడ్డి వర్తింపజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్లు, నేతలు చెన్నయ్య, గోరేమియా, గోపాల్ రెడ్డి, కుమార్, మహేందర్ గౌడ్, అంజిరెడ్డి, పొన్నాల నర్సారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## విదేశీ పర్యటన ముగించుకుని వనపర్తికి వచ్చిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి స్వాగతం

- **బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ ఆహ్వానం..**
- **పుష్పగుచ్ఛంతో అభినందనలు**

**వనపర్తి,జూలై 11 (ప్రజాక్షేత్రం):**

విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఘన స్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షులు మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరావు, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పరంజ్యోతి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశీ పర్యటనలో తెలంగాణకు చెందిన ఎన్నారైలను నిరంజన్‌రెడ్డి కలుసుకుని రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కుంటుపడిన అంశాలను వివరించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ భావజాలాన్ని వారికి వివరించి పార్టీ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేశారని అన్నారు.
ఈ స్వాగతం పలికి సన్మానించిన వారిలో రఘువర్ధన్‌రెడ్డి,ధర్మా నాయక్,మాధవ్‌రెడ్డి,జోహెబ్ హుస్సేన్,సయ్యద్ జమీల్, మహేశ్వర్‌రెడ్డి,చిట్యాల రాము, హర్షవర్ధన్‌రెడ్డి,సత్యనారాయణ చారి, ఖాదర్షా,బలీద్‌పల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వనపర్తి పర్యటన

- **రూ.139 కోట్ల హెచ్ఏఎం రహదారి పనులకు శంకుస్థాపన**
- **భారీ బైక్ ర్యాలీ**
- **ఆర్జీ గార్డెన్‌లో బహిరంగ సభ**

**వనపర్తి,జూలై 11(ప్రజాక్షేత్రం):**



రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం (జూలై 12) వనపర్తి నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11 గంటలకు వనపర్తి పట్టణ శివారులోని నర్సింగాయపల్లి డిగ్రీ కళాశాల సమీపంలో హెచ్ఏఎం (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో రూ.139 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.
మంత్రి పర్యటనలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

**వెయ్యి మందితో బైక్ ర్యాలీ**

శంకుస్థాపన కార్యక్రమం అనంతరం సుమారు వెయ్యి మంది కార్యకర్తలు, యువతతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ గాంధీ చౌక్, అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్ గాంధీ చౌరస్తా, ఇందిరాగాంధీ చౌరస్తా, భగీరథ చౌరస్తా మీదుగా సాగి ఆర్జీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటుందని వెల్లడించారు.

**ఆర్జీ గార్డెన్‌లో బహిరంగ సభ**

బైక్ ర్యాలీ అనంతరం ఆర్జీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులు, మౌలిక వసతుల విస్తరణపై మంత్రి వివరించనున్నట్లు పేర్కొన్నారు.

**కార్యకర్తలకు పిలుపు**

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పిలుపునిచ్చింది. మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు,పీసీసీ సభ్యులు,కౌన్సిలర్లు,మాజీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ, యువజన, మహిళా, ఎన్ఎస్‌యూఐ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల నాయకులు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.



భారతీయ కళాకారుడు పీకే మహానందియా దిల్లీలో వీధి చిత్రకారుడు. ఆ సమయంలో స్వీడన్ నుంచి పర్యాటకురాలిగా వచ్చిన ఓ అమ్మాయితో ఆయనకు పరిచయం ఏర్పడి.. అది ప్రేమగా మారి వారిద్దరూ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన కొన్నాళ్లకు ఆ అమ్మాయి “మళ్లీ ఆగస్టులో వస్తాను సరేనా” అని చెప్పి తన స్వదేశానికి వెళ్తుంది. కానీ.. ఆమె చెప్పిన గడువు అయిపోయినా తను తిరిగి రాదు. దీంతో తన భార్యను ఎలాగైనా చేరుకోవాలని నిర్ణయించుకున్నాడు పీకే. విమానం టికెట్ కొనే ఆర్థిక స్తోమత లేకపోయినా.. తన సైకిల్‌పైనే దిల్లీ నుంచి స్వీడన్‌కు ప్రయాణం మొదలు పెట్టి ఎట్టకేలకు తన సతీమణిని చేరుకున్నాడు. ఇప్పడీ కథను డాక్యుమెంటరీ రూపంలో ‘ది సైకిల్ ఆఫ్ లవ్’ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతుంది నాయిక ప్రియాంక చోప్రా. ఆమె ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ డాక్యుమెంటరీకి ఆస్కార్ అవార్డు గ్రహీత ఓర్లాండో వాన్ ఐన్సీడెల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే దీని ట్రైలర్‌ను పంచుకుంటూ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది ప్రియాంక. “ప్రేమ కోసం ఖండాలు దాటుతూ సైకిల్‌పై సాగిన పీకే మహానందియా అద్భుత ప్రయాణం గురించి మొదటిసారి విన్నప్పడు ఆశ్చర్యపోయాను. ‘ది సైకిల్ ఆఫ్ లవ్’ ఒక గొప్ప సాహసయాత్రే కాకుండా.. లోతైన మానవీయ కథ కూడా” అని తన పోస్ట్‌లో పేర్కొంది. ఈ డాక్యుమెంటరీ అమెరికాలో ఆగస్టు 28న, యూకేలో సెప్టెంబరు 18న థియేటర్లలోకి రానుంది.

# ఆపరేషన్ డ్రీమ్ థియేటర్

# ఎప్పటికైనా అవే శాశ్వతం

‘ఉస్తాద్ భగత్ సింగ్’తో ఈ ఏడాది ప్రారంభంలోనే తెరపై మెరిసి ప్రేక్షకుల్ని అలరించింది రాశీ ఖన్నా. ఈ భామ ఖాతాలో అక్షయ్ కుమార్‌తో నటిస్తున్న ఓ సినిమా కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రాన్ని అనీజ్ బాజ్మీ తెరకెక్కిస్తున్నారు. విద్యా బాలన్ కీలక పాత్ర పోషిస్తుంది. తాజాగా రాశి.. ఇందులో తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకుంటూ తన అనుభవాల్ని పంచుకుందామె. “ప్రతి షెడ్యూల్ మనకు ఏదో ఒక విషయాన్ని నేర్పుతుందని ఎప్పుడూ నమ్ముతా. షూటింగ్ మధ్యలో అనారోగ్యం బారిన పడటం ఏ మాత్రం మంచిది కాదు. నిజానికి కొన్ని సందర్భాల్లో నేను శారీరకంగా కష్టపడాల్సి వచ్చేది. కానీ అప్పుడు కుటుంబ సభ్యుల నుంచి వచ్చే ఫోన్ కాల్, యూనిట్‌లోని వారందరూ ‘క్షేమంగానే ఉన్నారా?’ అని అడిగే ఆప్యాయత.. ఇవన్నీ ఆరోజు భారాన్ని ఒక్కసారిగా తగ్గించేవి. ఈ సినిమా చిత్రీకరణ పూర్తవడం గురించి ఆలోచించినప్పడు.. నాకు అలసట కాదు కృతజ్ఞతభావమే గుర్తొస్తుంది. ఇవన్నీ నా సినీ ప్రయాణంలో మంచి జ్ఞాపకాలు. ఎంతదూరమెళ్లినా.. ఎప్పటికైనా అవే మనతో శాశ్వతంగా ఉంటాయ”ని ఆ పోస్ట్‌లో పేర్కొంది రాశి.



# ‘మసూద’ డైరెక్టర్‌తో నాగ చైతన్య నెక్స్ట్ ప్రాజెక్ట్..?

దర్శకుడు సాయి కిరణ్ 'మసూద' చిత్రంతో అద్భుతమైన విజయాన్ని అందుకుని మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే ఈ సినిమా విడుదలై చాలా కాలం గడిచినా, ఆయన తదుపరి చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. తాజాగా ఆయన నెక్స్ట్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ క్రేజీ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాయి కిరణ్ ఇప్పటికే ఓ హారర్ థ్రిల్లర్ కథను సిద్ధం చేసుకుని, దానిని ఇటీవల నాగ చైతన్యకు వినిపించినట్లు సమాచారం. కథ మొత్తం విన్న నాగ చైతన్య ఇంకా తన నిర్ణయాన్ని వెల్లడించలేదని తెలుస్తోంది. ఒక వేళ సాయి కిరణ్ చెప్పిన కథకు నాగ చైతన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆయన కెరీర్‌లో ఇదే తొలి హారర్ థ్రిల్లర్ చిత్రం కానుంది.

దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సహజంగానే మంచి అంచనాలు ఏర్పడే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే సాయి కిరణ్ - నాగ చైతన్య కాంబినేషన్‌లో సినిమా నిజంగానే పట్టాలెక్కుతుందా లేదా అనే విషయంపై అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్ నిర్మించే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఇక ప్రస్తుతం నాగ చైతన్య, కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.





# ఆపరేషన్ సుకుమారి

అల్లంత దూరాన కనిపించే చందమామలాంటిదే దామిని కూడా. ఆమెని ఎవ్వరూ ముట్టుకోలేరు, హత్తుకోలేరు. అలాంటి అమ్మాయికి పెళ్లి చేయడం కోసమే ఆ ఊళ్లో ఆపరేషన్ సుకుమారి మొదలైంది. ఫలితం మాత్రం కనిపించదు. కానీ ఓ అబ్బాయి మాత్రం ఆమె గురించి తెలుసుకోకుండానే ఎంతో ఇష్టపడి పెళ్లి చేసుకున్నాడు. మరి ఆ తర్వాత అతనికి ఎదురైన అనుభవాలు ఎలాంటివో తెలియాలంటే ‘ఓ..! సుకుమారి’ చూడాల్సిందే. తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటించిన చిత్రమిది. భరత్ దర్శన్ దర్శకత్వం వహించారు. మహేశ్వరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఈ నెల 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. తాకగానే షాక్ కొట్టే ట్రాన్స్‌ఫార్మర్‌లాంటి ఓ అమ్మాయి చుట్టూ తిరిగే కథతో ఈ చిత్రం రూపొందినట్టు ట్రైలర్ చాటుతోంది. ప్రేమ, కామెడీ, భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూ రూపొందించినట్టు తెలుస్తోంది. “ఇంటిల్లిపాదికీ వినోదం పంచే మరో కొత్త తరహా కథ ఇది. తిరువీర్ అమాయకమైన పల్లెటూరి యువకుడిగా పాత్రలో సహజంగా నటించారు. ఐశ్వర్య రాజేశ్ అందం, నటనతో అలరిస్తారు. ప్రతి పాత్ర ఇందులో వినోదం పంచుతుంది. ఒక సమస్యని ఎదుర్కొంటున్న జంట జీవితంలో ప్రేమ, ఆనందం ఎలా చోటు చేసుకున్నాయన్నది ఈ కథలో కీలకమ”ని సినీ వర్గాలు చెప్పాయి.



గర్భిణీలకు గర్భధారణ చివరి దశలో నిద్రలేమి, అలసట, పదే పదే బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి రావడం లాంటి శారీరక ఇబ్బందులు ఎదురుకావడం సహజమే. ఈ నేపథ్యంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె (Deepika Padukone) ప్రస్తుతం తన ‘థర్డ్ ట్రైమిస్టర్’ అనుభవాలను అభిమానులతో పంచుకున్నారు. ఆమె రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గర్భంతో ఉన్న మహిళలు పడే ఇబ్బందులను వివరిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఫన్నీ రీల్‌ను ఆమె షేర్ చేశారు. నిండు గర్భిణీగా ఉన్నప్పడు రాత్రిళ్లు నిద్రలేచి పదే పదే బాత్‌రూమ్‌కు వెళ్లడం ఎంత ఇబ్బందిగా ఉంటుందో ఆ వీడియోలో చూపించారు. సోషల్ మీడియాలో ఈ పోస్ట్ ఇప్పడు వైరల్‌గా మారింది.

ఇక దీపికా, రణ్‌వీర్ దంపతులకు 2024 సెప్టెంబరులో తొలి సంతానంగా ఆడబిడ్డ (దువా) జన్మించిన సంగతి తెలిసిందే. బిడ్డ పుట్టిన తర్వాత నుంచి దీపిక తన పని గంటల విషయంలోనూ స్పష్టమైన నిబంధనలు పెడుతున్నారు. సినిమాల విషయానికొస్తే షారుఖ్ ఖాన్ ‘కింగ్’, అల్లు అర్జున్ పాన్ ఇండియా చిత్రం ‘రాకా’లో దీపిక నటిస్తున్నారు. అలాగే సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న ‘లవ్ అండ్ వార్’ చిత్రంలోనూ ఆమె అతిథి పాత్రలో మెరవనున్నారు.

# ‘థర్డ్ ట్రైమెస్టర్’ ఇలా ఉంటుంది..



# బాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనున్న నిహారిక..

యూట్యూబర్‌గా, కంటెంట్ క్రియేటర్‌గా తనకంటూ స్పెషల్ ఈమేజ్‌ను క్రియేట్ చేసుకున్న ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారిక ఎన్ఎమ్ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి వెండితెరపై కూడా సక్సెస్ అందుకుంటుంది. ఇప్పటికే తెలుగులో రెండు చిత్రాలు చేసిన నిహారిక.. తాజాగా ‘హృదయం మురళి’ సినిమాతో తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో నిహారిక ఎన్ఎమ్ తన సహసిద్ధమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇలా తెలుగు, తమిళంలో వరుస సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీకి సిద్ధమైంది. బాలీవుడ్‌లో ఈమె నటిస్తున్న చిత్రం ‘భాయ్ తేరా స్టార్ హై’. వివేక్ బి. అగర్వాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రాఘవ్, సంజయ్ కపూర్, బర్ఖా సింగ్, నిహారిక ఎన్ఎమ్, చందన్ రాయ్ సన్యాల్ తిదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్ విడుదల కాగా.. నవ్వులు, ఎమోషన్స్ అండ్ రొమాన్స్‌తో సూపర్ రెస్పాన్స్ సొంతం చేసుకుంటుంది. దీంతో హిందీలో కూడా నిహారిక ఎంట్రీ గ్రాండ్‌గా ఉండనుందని తెలుస్తుండగా.. ఈమెకు అక్కడ మరో ఆఫర్ దక్కినట్లు సమాచారం. అయితే ఈసారి ఇది ఓ లేడీఓరియెంటెడ్ చిత్రమని టాక్. ప్రస్తుతం కథ చర్చలు జరుగుతుండగా.. త్వరలో అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు సమాచారం. ఇది ఆమె కెరీర్‌లో ఒక ఎగ్జైట్‌మెంట్ ప్రాజెక్ట్ కానుందని తెలుస్తుండగా.. భవిష్యత్తులో మోస్ట్ వాటెంటెడ్ హీరోయిన్స్ లిస్ట్‌లో చేరనుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# చిన్నారులను అలరించే కథాంశంతో ‘సూపర్ హీరో బాబు’

అర్జున్ దాస్, శాండీ మాస్టర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ‘సూపర్ హీరో బాబు’ (Super Hero Babu). విఘ్నేశ్ వేణుగోపాల్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై కె.ఎస్.సినిష్, శంజన్ జి సంయుక్తంగా నిర్మించారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీ ఓ సరికొత్త కథాంశంతో రూపొందుతున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ముఖ్యంగా చిన్నారులను ఆకట్టుకునే అంశాలను మేళవించి తీర్చిదిద్దినట్లు తెలిపింది. శాండీ మాస్టర్, అర్జున్ దాస్ కాంబోలో వచ్చే సీన్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయట. హేషమ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394